


నేటి దినపత్రిక

# సూర్య


www.suryaa.com

19వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

బుధవారం,18 మార్చి 2026

8 పేజీలు


వేల కోట్ల టర్నోవర్, వందల ఎకరాల విస్తీర్ణం, వేల మంది వర్కర్లు.. ఇదీ కోరమాండల్ ఇంటర్నేషనల్ బయటకు కనిపించే రూపం. కానీ, ఆ కలర్‌ఫుల్ హంగుల వెనుక 'మృత్యువు' పొంచి ఉందా? అంటే అవుననే అంటున్నాయి పర్యావరణ మేధావుల వర్గం. బాధితులు, ప్రజలు, ప్రత్యక్ష సాక్షుల ఘోష ఆధారంగా 'సూర్య' సేకరించిన పక్కా ఆధారాలు. ఎన్విరాన్‌మెంట్ పర్మిషన్ల ఉల్లంఘన నుంచి సేఫ్టీ లోపాల వరకు ఈ ప్లాంట్‌లో జరుగుతున్న నిర్లక్ష్యంపై ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో అందించిన క్షేత్రస్థాయిలో పరిశోధనాత్మక కథనం...

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**


# కాకినాడ పొలిమేరల్లో 'కెమికల్' టైమ్ బాంబ్

## కోర్టు తీర్పుల ధిక్కరణ
## జీవించే హక్కును హరించడమే నేరం!


గతంలో తక్కువ ఉత్పత్తితో ఉన్నప్పుడు జనాభా లేని ప్రాంతంలో అనుమతులు ఇవ్వడం వేరు, కానీ ఇప్పుడు అనేక గ్రామాల నడిబొడ్డున అత్యంత ప్రమాదకర రసాయనాల ఉత్పత్తిని మూడు రెట్లు పెంచడం పక్కాగా నేరపూరితమే అని మేధావులు,పర్యావరణ వేత్తలు మొత్తుకుంటున్నారు. సుప్రీంకోర్టు తీర్పుల ప్రకారం ముఖ్యంగా ఎన్.సి. మెహతా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో ప్రజల నివాస ప్రాంతాలకు దగ్గరగా ఇలాంటి రసాయన పరిశ్రమల విస్తరణకు అనుమతులు ఇవ్వడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన 'జీవించే హక్కు'ను నేరుగా హరించడమే. సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిన 'అబ్సల్యూట్ లయబిలిటీ' నిబంధనను ఉల్లంఘిస్తూ, పాత అనుమతుల సాకుతో ఈ భారీ స్థాయి విష రసాయనాల తయారీకి పచ్చజెండా ఎలా ఇచ్చారు? అభివృద్ధి సాకుతో పర్యావరణాన్ని, ప్రజా ఆరోగ్యాన్ని పణంగా పెట్టడం 'నేరపూరిత నిర్లక్ష్యం' కిందకు వస్తుందని అంటున్నారు. చట్ట ప్రకారం పర్యావరణానికి ముప్పు లేదని నిరూపించాల్సిన బాధ్యత కోరమండల్ కంపెనీ యాజమాన్యానిదే... కానీ, కోరమాండల్ ఈ విషయంలో ఆ ముందస్తు జాగ్రత్త సూత్రాన్ని గాలికొదిలేసి, ప్రజల బతుకులను 'కెమికల్ టైమ్ బాంబ్'పై ఉంచడం కోర్టు తీర్పుల ధిక్కరణే అవుతుందని ప్రజలు, పర్యావరణ మేధావులు చెబుతున్నారు.

- మిగతా 2లో..

- కోరమాండల్ సేఫ్టీ.. కాగితాలకే పరిమితమా?
- బడ్జెట్ కోట్లు.. బతుకులు అరిచేతిలో!
- ఆరు నెలలకోసారి ఇచ్చే కాంప్లయన్స్ రిపోర్టుల ఊసేది?
- తుప్పు పట్టిన పైపులు..
- ట్రైనింగ్ లేని స్టాఫ్..
- వెలుగులోకి షాకింగ్ నిజాలు!




నిగ్గు తేల్చిన పిసిబి రిపోర్ట్.. కాలువలో పారుతుంది అత్యంత ప్రమాదకరమైన అమ్ల నీరే!




రికార్డులకే పరిమితమైన భద్రత. 2024 మే నుంచి 20 నెలలుగా అప్‌డేట్ లేని సేఫ్టీ ఆడిట్!

## ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి

**- జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరంఉందని రైతులు, స్వయం సహాయక సంఘాలు, యువతకు రుణాల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్అపూర్వభరత్ బ్యాంకు అధికారులను కోరారు. మంగళవారం కాకినాడ కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, జిల్లా అధికారులతో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశాలు జిల్లాజాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధ్యక్షతన జరిగింది. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ముఖ్యఅతిథిగా

- తరువాయి 2లో..

## నారా లోకేష్ నాయకత్వంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు

**- జీఎంసి బాలయోగి మున్సిపల్ స్కూల్ నందు ఆకస్మిక తనిఖీ చేసిన శాసనసభ్యులు వనమాడి కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్ర రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు నాయకత్వంలో విద్యావ్యవస్థలో సమూలమార్పులు తీసుకురావడం జరుగుతుందని కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. విద్యాశాఖమంత్రివర్యులు నారాలోకేష్‌బాబు ఆదేశాను సారం మంగళవారం దాటి సెంటర్‌నందుజిఎంసి బాలయోగి మున్సిపల్ స్కూల్ నందు కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమాడి కొండబాబు ఇంచార్జ్ కమిషనర్ సత్యనారాయణతో కలిసి అకస్మిక తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న డొక్కాసీతమ్మ భోజన

- తరువాయి 2లో..

## ఔషధ మొక్కల సాగులో ఆంధ్రప్రదేశ్ ముందంజ


**- ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్నకు కేంద్రం వెల్లడి**



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** రాజ్యసభలో సభ్యుడు సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు కేంద్ర ఆయుష్ శాఖ సహాయ మంత్రి ప్రతాపరావు జాదవ్ సమాధానం ఇస్తూ, ఆంధ్రప్రదేశ్ ఔషధ మరియు సుగంధ మొక్కల సాగులో దేశవ్యాప్తంగా ముందంజలో నిలిచినట్లు తెలిపారు. జాతీయ ఆయుష్ మిషన్ మరియు రాష్ట్ర ఔషధ మొక్కల బోర్డు ఆధ్వర్యంలో రాష్ట్రం గణనీయ పురోగతి సాధించిందని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో 15,682 హెక్టార్లలో సాగు జరగగా, 1,51,000 క్వింటాళ్ల ఉత్పత్తి నమోదై, రూ.312.79 కోట్ల విలువ సాధించబడిందనివెల్లడించారు. నన్నారి,సింధూర,అశ్వగంధ, ఘృత కుమారి, పిప్పలి, తులసివంటి పంటలు ప్రధానంగాసాగవుతున్నాయని మంత్రి తెలిపారు. అలాగే, 2015-2020 మధ్య 9,785 మంది రైతులు సబ్సిడీలు మరియు పంట అనంతర మౌలిక సదుపాయాల ద్వారా లబ్ధి పొందారని, 12 పోస్ట్-హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఔషధ మొక్కల ఎగుమతులు 2020-21లో రూ.2,796 కోట్ల నుంచి 2024-25లో

- తరువాయి 3లో..

# కాకినాడ పొలిమేరల్లో 'కెమికల్' టైమ్ బాంబ్




**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

అది సుమారు నాలుగు దశాబ్దాల క్రితం.. కాకినాడ పొలిమేరల్లో కోరమాండల్ ఫ్యాక్టరీ అడుగు పెట్టినప్పుడు ఆ ప్రాంతమంతా పచ్చని పొలాలు, ప్రశాంతమైన వాతావరణం. అప్పటి జనాభా చాలా తక్కువ, ఫ్యాక్టరీ చుట్టూ జనం ఉండేవారు కాదు. కానీ కాలక్రమేణా పరిస్థితులు మారిపోయాయి. ఫ్యాక్టరీచుట్టూ ఇళ్లువెలిశాయి,వేలసంఖ్యలో కుటుంబాలు చేరాయి, లక్షల్లఛ జనాభా విపరీతంగా పెరిగింది. ఒకప్పుడు ఊరికి దూరంగా ఉన్న ఫ్యాక్టరీ,ఇప్పుడు ఊరి నడిబొడ్డున ఉన్నట్లుగా మారిపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఫ్యాక్టరీని భారీగా విస్తరించడం అంటే లక్షలాది మంది ప్రాణాలను పణంగా పెట్టడమే. రాజ్యాంగం అందించిన ఆర్టికల్ 21 హరించడమే.. అందుకే ఇప్పుడు నిబంధనలు 100 శాతం కాదు, 200 శాతం పక్కాగా అమలు కావాలి. కేవలం రికార్డుల్లో చూపిస్తే సరిపోదు, క్షేత్రస్థాయిలో ప్రజల ప్రాణాలకు భరోసా ఉండాలి.

**పాత ప్రొడక్షన్లో పరిమిత వనరులు – అదుపులో ఉన్న భద్రత**

గతంలో ఈ యూనిట్ ప్రధానంగా సంప్రదాయ ఎరువులైన డీఏపీ మరియు ఎన్పీకే కాంప్లెక్స్ ఎరువుల తయారీకే పరిమితమై ఉండేది. అప్పట్లో ప్లాంట్ యొక్క మొత్తం ఉత్పత్తి సామర్థ్యం రోజుకు 4,800 మెట్రిక్ టన్నులుగా ఉండేది. ఆ రోజుల్లో ఫ్యాక్టరీకి, నివాస ప్రాంతాలకు మధ్య భౌగోళిక దూరం స్పష్టంగా ఉండేది. జనాభా ఫ్యాక్టరీకి కనీసం 5 కిలోమీటర్ల దూరంలో ఉండేవారు, మొత్తం మీద ఒక 5,000 మంది జనాభా మాత్రమే ఆ పరిసరాల్లో ఉండేవారు. తక్కువ ఉత్పత్తి సామర్థ్యం, దూరంగా ఉన్న జనాభా కారణంగా అప్పట్లో అమ్మోనియా నిల్వలు మరియు పైప్‌లైన్లపై ఒత్తిడి తక్కువగా ఉండేది, తద్వారా భద్రతా ప్రమాణాలు పూర్తిగా అదుపులో ఉండేవి. కానీ నేడు ఆ పరిస్థితి తలకిందులైంది.

**భారీ విస్తరణ: రూ.2,097 కోట్ల పెట్టుబడి..**
**ఆమ్లాల ఉత్పత్తితో పెరుగుతున్న ముప్పు!**

లాభాల వేటలో పడిన మేనేజ్‌మెంట్, సుమారు రూ. 2,097 కోట్ల భారీ ఇన్వెస్ట్‌మెంట్‌తో ప్లాంట్ ముఖచిత్రాన్ని మార్చేస్తోంది. ఈ విస్తరణలో భాగంగా సరికొత్తగా 'నానో డీఏపీ' వంటి లిక్విడ్ ఫెర్టిలైజర్లను ప్రవేశపెట్టడమే కాకుండా, ప్లాంట్ మొత్తం ప్రొడక్షన్ కెపాసిటీని రోజుకు 6,000 మెట్రిక్ టన్నులకు పెంచారు. ఇందులో భాగంగా సల్ఫ్యూరిక్ యాసిడ్ ఉత్పత్తిని ఏడాదికి 3.9 లక్షల టన్నుల నుండి ఏకంగా 10.5 లక్షల టన్నులకు మూడు రెట్లు పెంచుతున్నారు. అలాగే ఫాస్ఫరిక్ యాసిడ్ ఉత్పత్తిని 1.8 లక్షల టన్నుల నుండి 2.97 లక్షల టన్నులకు పెంచారు. ఈ భారీ ప్రాసెసింగ్ కోసం ప్లాంట్ ఇప్పుడు అదనంగా 12.5 మెగావాట్ల కొత్త విద్యుత్ వినియోగానికి సిద్ధమైంది. ఈ వేడికి గ్రామాలు తీవ్ర వేడిని ఎదుర్కొనే ప్రమాదం ఉంది.. వీటన్నిటి కంటే భయంకరమైన విషయం ఏమిటంటే, ఈ విస్తరణ తర్వాత ప్లాంట్ రోజుకు సుమారు కోటి పాతిక లక్షల లీటర్ల నీటిని వినియోగిస్తోంది. ఇంతటి భారీ ఉత్పత్తి సామర్థ్యం, అధిక విద్యుత్ భారం మరియు అపారమైన నీటి వినియోగం వెనుక ఉండే రసాయన చర్యలు క్షేత్రస్థాయిలో పెను ప్రమాదానికి దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**యంత్రాల పనితీరు: తుప్పు పట్టిన వ్యవస్థలు.. అవుట్ డేటెడ్ టెక్నాలజీ!**

విస్తరణ పేరుతో కొత్త ప్లాంట్లు నిర్మిస్తున్నామని చెబుతున్నా, అసలు కీలకమైన యంత్రాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. అత్యంత ప్రమాదకరమైన ఆమ్లాలు, వాయువులను మోసుకెళ్లే పైపులైన్లు మరియు కంప్రెషర్లు దశాబ్దాల నాటివి కావడంతో అవి తీవ్రస్థాయిలో కొరోషన్ పట్టి ఉన్నాయి. సముద్రపు ఉప్పు గాలి ప్రభావంతో యంత్రాల సామర్థ్యం తగ్గిపోయినప్పటికీ, మేనేజ్‌మెంట్ వాటిని మార్చకుండా కేవలం రంగులు వేసి మేనేజ్ చేస్తోంది. సేఫ్టీ వాల్వ్‌లు మరియు సెన్సార్లు చాలా చోట్ల మొరాయిస్తున్నాయి. ఒకవైపు ప్రొడక్షన్ మూడు రెట్లు పెంచి, మరోవైపు కాలం చెల్లిన యంత్రాలతో పని చేయించడం అంటే పరోక్షంగా పెను ప్రమాదాన్ని ఆహ్వానించడమే.

ఈ పాత యంత్రాల వల్ల ఎప్పుడు ఏ పైపు పగులుతుందో, ఏ వాల్వ్ ఫెయిల్ అవుతుందో తెలియక అటు వర్కర్లు, ఇటు చుట్టుపక్కల ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతుకుతున్నారు.

**గ్రీన్ బెల్ట్.. విషవాయువుల వేగాన్ని అడ్డుకొనే రక్షణ కవచం!**

గ్రీన్ బెల్ట్ అంటే కేవలం పచ్చదనం కాదు, అది ఒక పకడ్బందీ 'ఎయిర్ ఫిల్టర్'. గాలి కంటే బరువైన క్లోరిన్, అమ్మోనియా వంటి విషవాయువులు లీకైనప్పుడు అవి భూమికి సమాంతరంగా 2 నుండి 5 మీటర్ల ఎత్తులో ప్రయాణిస్తాయి. వీటిని అడ్డుకోవడానికి మొదటి వరుసలో 5 నుండి 8 మీటర్ల ఎత్తుండే దట్టమైన పొదలు, గడ్డి జాతులు ఉండాలి. చిమ్నీల నుండి వెలువడే సల్ఫర్ డయాక్సైడ్ వంటి తేలికపాటి వాయువులు పైకి లేచి ప్రయాణిస్తాయి, వీటిని వడకట్టడానికి రెండో వరుసలో 15 నుండి 20 మీటర్ల ఎత్తు పెరిగే వేప,రావి,మర్రివంటి వృక్షాలు 'అంచెలంచెలుగా' ఉండాలి. ఈ 'మల్టీ-లేయర్' అడవి వలయం వాయువుల వేగాన్ని తగ్గించి, ప్రజలు అలారాల మోత విని సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు అమూల్యమైన సమయాన్ని అందిస్తుంది. కానీ కోరమాండల్ 265 ఎకరాల్లో ఈ శాస్త్రీయ గ్రీన్ బెల్ట్ ఎక్కడ? ప్రస్తుతం ఉన్న మొక్కల సంఖ్య, వాటి ఎత్తుపై అటవీ శాఖ తక్షణమే ఆడిట్ నిర్వహించాలి. అటవీ శాఖ లెక్కలు తేలాలి, లేకపోతే గ్రీన్ బెల్ట్ లేని కారణంగా విషవాయువులు నేరుగా నిమిషాల్లో గ్రామాల్లోకి ప్రవేశించి జనారణ్యాన్ని శ్మశానంగా మార్చే ప్రమాదం ఉంది. 100కి 100 శాతం నిబంధనల ప్రకారం గ్రీన్ బెల్ట్ లేని పక్షంలో అటవీ శాఖ ఎన్ఓసి ని నిలిపివేయాలి.

**రికార్డుల్లో 'జీరో'.. కాలువల్లో 'యాసిడ్'!**

కంపెనీ సిటిఓ ప్రకారం ఇది 'జీరో లిక్విడ్ డిశ్చార్జ్' ప్లాంట్. అంటే ఒక్క చుక్క పొల్యూటెడ్ వాటర్ కూడా బయటకు రాకూడదు. కానీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ జరిపిన తాజాగా జరిపిన టెస్టుల్లో షాకింగ్ నిజాలు బయటపడ్డాయి. ప్లాంట్ వెలుపల ఉన్న కాలువల్లో నీటి పీహెచ్ విలువ 5.01గా నమోదైంది. అంటే అది అత్యంత డేంజరస్ యాసిడ్ వాటర్ నిబంధన అతిక్రమించి బయటకు వదిలేస్తున్నారు. దీనివల్ల అక్కడ నివసిస్తే ప్రజలకు తీవ్ర రోగాలు వ్యాపించే అవకాశం ఉంది.

**2024 సేఫ్టీ ఆడిట్లో నిజాలు.. తుప్పు పట్టిన పైపులు.. ప్రాణాలతో చెలగాటం!**

కోరమాండల్ ప్లాంట్‌లోని 10,000 మెట్రిక్ టన్నుల అమ్మోనియా స్టోరేజ్ ట్యాంకులు ఇప్పుడు స్థానిక ప్రజల గుండెల్లో ఆందోళన రేపుతున్నాయి. ప్లాంట్ విస్తరణలో భాగంగా సిటిఇ మరియు పాత ప్లాంట్ సిటిఓ నిబంధనల ప్రకారం భద్రతా ప్రమాణాలు అత్యున్నత స్థాయిలో ఉండాలి. అయితే 2024 తాజా ఆడిట్ విశ్లేషణలో రెండు భారీ అమ్మోనియా స్టోరేజ్ ట్యాంకుల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉన్నట్లు తేలింది. కొన్ని చోట్ల పైపులైన్లు తీవ్రంగా తుప్పు పట్టి, ఏ క్షణమైనా పెను ప్రమాదానికి దారితీసే స్థితిలో ఉండటం విస్తుగొలుస్తోంది. 10,000 టన్నుల భారీ నిల్వ ఉన్న చోట, ఆడిట్‌లో గుర్తించిన లోపాలను సరిదిద్దకుండా ప్లాంట్ నడపడం వల్ల భవిష్యత్తులో ఎటువంటి అనర్థం సంభవిస్తుందోనని చుట్టుపక్కల ప్రజలు భయపడుతున్నారు. ఆడిట్ నివేదికలోని ఈ చేదు నిజాలు ప్లాంట్‌లోని భద్రతా వ్యవస్థల డొల్లతనాన్ని ఎత్తిచూపుతున్నాయి. ఈ లోపాలను సరిదిద్దకపోతే అది పెను ప్రమాదానికి దారితీసే ముప్పు పొంచి ఉందని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

**నిధుల దుర్వినియోగం – సేఫ్టీ ఆడిట్‌లో నేరపూరిత నిర్లక్ష్యం?**

నిబంధనల ప్రకారం జరగాల్సిన సేఫ్టీ ఆడిట్ చివరగా 2024 ఆరంభంలో జరిగింది, కానీ ఆతర్వాత నిబంధనలు పాటించినట్లు ఎక్కడా అధికారిక రికార్డులు అందుబాటులో లేవు. కోరమండల్ ఫ్యాక్టరీ ఫిట్నెస్‌పై సేఫ్టీ ఆడిట్ రిపోర్ట్ సుమారు 20 నెలలుగా నిర్వహించిన దాఖలాలు అంతు పట్టడం లేదు.ఈ సంవత్సరం జనవరి నెలలో కాలుష్య నియంత్రణ మండలి నుండి నోటీసులు జారీ చేసినా, పర్యావరణ ఆడిట్ నివేదికల సమర్పణలో జాప్యం జరగడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**నివేదికల దాగుడుమూతలు !**

పర్యావరణ రూల్స్ ప్రకారం ప్రతి ఆరు నెలలకు ఒకసారి కాంప్లయన్స్ రిపోర్ట్ సబ్మిట్ చేయాల్సి ఉండగా, కోరమాండల్ అందులో ఫెయిల్ అయిందని సమాచారం. ఉండాల్సిన గ్రీన్ బెల్ట్ రికార్డుల్లో మాత్రమే కనిపిస్తోంది తప్ప గ్రౌండ్‌లో లేదు.**ప్రజల డిమాండ్:**నిబంధనల ప్రకారం ప్రతి ఆరు మాసాలకు ఒకసారి తప్పనిసరిగా సేఫ్టీ ఆడిట్ నిర్వహించాల్సి ఉన్నప్పటికీ, కోరమాండల్ యూనిట్‌లో గత సంవత్సర కాలంగా ఎటువంటి సేఫ్టీ ఆడిట్ రిపోర్టులు లేవన్న సమాచారం ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో, కేవలం కంపెనీ పర్యవేక్షణలో కాకుండా, జిల్లా అధికారులు ఎంపిక చేసిన అత్యున్నత ప్రమాణాలు మరియు పేరు ప్రఖ్యాతలుగల ఒక 'థర్డ్ పార్టీ'ద్వారా తక్షణమే సమగ్ర సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఈ థర్డ్ పార్టీ ఆడిట్ నివేదికను బహిరంగ పరచాలని, అప్పటి వరకు ప్రజా భద్రతపై జిల్లా అడ్మినిస్ట్రేషన్ బాధ్యత వహించాలని స్థానికులు కోరుతున్నారు. 100% కి 200 శాతం భద్రతా నిబంధనలు అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని వారు స్పష్టం చేస్తున్నారు.అభివృద్ధి పేరుతో విస్తరిస్తున్న ఈ పారిశ్రామిక సామ్రాజ్యాల నీడలో సామాన్యుడి జీవనం బలి కాకూడదు. లాభాల వేటలో కంపెనీలు ఉంటే.. రేపు మరో విపత్తు సంభవించినప్పుడు కన్నీళ్లు పెట్టుకోవడం తప్ప చేసేదేమీ ఉండదని మేధావులు ఘోషిస్తున్నారు. కాకినాడ ప్రజల భవిష్యత్తు కోసం, పర్యావరణ రక్షణ కోసంతక్షణమే చర్యలు తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని... థర్డ్ పార్టీ ఆడిట్ సమర్థవంతంగా ఢిల్లీ స్థాయి గొప్ప కంపెనీలతో చేయించి, ఆనివేదికలను బహిరంగపరిచి అధికారులు ప్రజలకు భరోసా ఇవ్వాలని కోరుకుంటున్నారు.

## ప్రభుత్వ పథకాల లక్ష్య సాధనలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి

మొదటిపేజి తరువాయి

హాజరైన ఈ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో వివిధ రంగాలకు, ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలకు రుణాల కల్పనను సమీక్షించి, తదుపరి త్రైమాసాలలో అనుసరించాల్సిన ప్రణాళికలపై ఈ సందర్భంగా చర్చించారు.ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. జిల్లాలో వార్షిక రుణ ప్రణాళికంగా వివిధ రంగాలకు నిర్దేశించిన లక్ష్యాలను బ్యాంకర్లు చేరుకోవడంతోపాటు అవసరతంలో ఉన్న వివిధ వర్గాల ప్రజలకు విరివిగా రుణాలు అందించి సమాజ ఉన్నతికి కృషి చేయాలన్నారు. గత మాసంత్రానికి జిల్లాలో రుణా ప్రణాళిక కింద 26,408 కోట్లు టార్గెట్ గా నిర్ణయించుగా ఇప్పటివరకు 26,074.5 కోట్ల రుణాలు ఇచ్చారని 98.73 శాతం టార్గెట్ పూర్తి చేయడం జరిగింది అన్నారు. వ్యవసాయ రంగంలో స్వల్పకాలిక రణాలు కింద 13,733 కోట్లు టార్గెట్ గాను 12,632 కోట్ల రుణాలు రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. రానున్న త్రైమసాల్లో పంట రుణాలు మరింత వేగవంతం చేయాలని బ్యాంకర్లకు జేసీ సూచించారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా ఈ ఆర్థిక సంవత్సరం ఇప్పటివరకు 10186 డ్వాక్రా సంఘాలకు 1298.71 కోట్ల రుణాలు పంపిణీ చేయగా మెప్మా ద్వారా2,737 పట్టణ సంఘాలకు 420.52 కోట్లు బ్యాంకు రుణాల పంపిణీ చేశారన్నారు. అదేవిధంగా 3,526 మంది మహిళా పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు 55.55 కోట్ల రుణాలు అందించడం జరిగిందని జేసీ తెలిపారు.పీఎంఈజీపీ కింద 2025-26 ఆర్థిక సంవత్సరంలో 122 యూనిట్లు టార్గెట్ కాగా ఇప్పటివరకు 180 యూనిట్లకు 850 కోట్ల మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రధానమంత్రి ముద్రా యోజన (ముద్రా) రుణాల కింద 386 మందుకి 170 కోట్లు మంజూరు చేసినట్లు జేసీ తెలిపారు.

ఈసందర్భంగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ ఉపాధి ఆర్థిక ప్రోత్సాహక కార్యక్రమాలపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతం చేయాలన్నారు. ముఖ్యంగా ప్రాధాన్యతా రంగాలకు సంబంధించిన రుణాల పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆమె తెలిపారు.అనంతరం నాబార్డ్ 2026-2027 ఆర్థిక సంవత్సరానికి వివిధ రంగాల ఆర్థిక అభివృద్ధికి 23598 కోట్ల రుణ ప్రణాళికను జేసీ..ఎమ్మెల్సీ, ఎల్డీఎం, నాబార్డ్ ఎల్డీఎం తదితరులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా నాబార్డ్ ఎల్డీఎం వై. సోమనాయుడు మాట్లాడుతూ.. 500 మంది మహిళా పారిశ్రామిక వేత్తల ను ప్రోత్సహించడానికి నాబార్డ్ దేశంలో మొట్టమొదటి సరిగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాని ఎంపిక చేసిందన్నారు. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాలో 9 వ్యాపారాలలో 150 యూనిట్స్ ఏర్పాటుకు బ్యాంకర్స్ కమిటీ సుమారు 5 కోట్ల రుణాలు మంజూరుకు అనుమతి చేసిందని, దీని ద్వారా 500 నుండి 800 మందికి ఉపాధి దొరుకుతుందని ఆయన తెలిపారు.సమావేశంలో యూనియన్ బ్యాంక్ రీజినల్ హెడ్ బీ.జీ.ఆర్. నాయుడు, ఆర్బిఐ ఎల్డిఓ గిరిధర్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సీహెచ్ఎస్వి ప్రసాద్, వ్యవసాయ శాఖ జేడీ ఎన్.విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సీహెచ్ గణపతి, డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసు, వివిధ బ్యాంకుల కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## నారా లోకేష్ నాయకత్వంలో విద్యావ్యవస్థలో సమూల మార్పులు

మొదటిపేజి తరువాయి

పథకాన్ని అమలు తీరును పరిశీలించి, నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం నాణ్యత తెలుసుకుంటూ కొండబాబు విద్యార్థులతో కలిసి భోజనం చేసారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో సమూల మార్పులు కోసం విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని,ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని ప్రభుత్వ పాఠశాలలో అందించడం జరుగుతుందని,నాణ్యమైన సన్నబియ్యం, కూరగాయలు, గుడ్లు,మరియు చిక్కీలతో కూడిన మెనూతో 1 నుండి 10వ తరగతి వరకు విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని, ఇది విద్యార్థుల హాజరును పెంచడానికి మరియు డ్రాపౌట్‌లను తగ్గించడానికి సహాయపడుతుందని అన్నారు. విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకుంటూ మధ్యాహ్న భోజనం పథకంలో వారికి అందుతున్న భోజనం యొక్క నాణ్యత గురించి విద్యార్థులను అడిగి తెలుసుకోగా విద్యార్థులను సంతోషాన్ని వ్యక్తం చేశారని, విద్యార్థులకు ప్రతీ విషయం క్షుణ్ణంగా అర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధనా పద్ధతులను అనుసరిస్తున్నారని కొండబాబు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు కేటీ సుధాకర్, స్థానిక నాయకులు గెడ్డం పూర్ణ చంద్రశేఖర్, పాలిక నాని, పెదపూడి కుమార్, మేడిశెట్టి చిన్ని, కోపనాతి నాగు కుమారి, రాళ్లపూడి ప్రకాష్, పాలిక సూర్య, సంఘాని నాగూర్, డబ్బేరు జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

# బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరం





- పోలవరం ద్వారా అన్ని రంగాలు అభివృద్ధి
- దేశ అభివృద్ధిలో కీలక స్థానం
- రాష్ట్ర ప్రభుత్వ కృషి శ్లాఘనీయం

**కాకినాడ, మేజర్ న్యూస్ :** పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ను ప్రతి ఒక్కరూ సందర్శించాల్సిన ఆవశ్యకత ఉందని రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి అన్నారు. ప్రాజెక్టు సందర్శన తమ జీవితాల్లో ఒక మధురమైన ఘట్టంగా నిలిచిపోతుందని అన్నారు. భారతదేశ అభివృద్ధిలో ఆంధ్ర అగ్రస్థానంలో నిలబడుతుందన్న ఆత్మవిశ్వాసాన్ని కృష్ణకుమారి వ్యక్తం చేశారు. రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ సభ్యుల బృందం ఒకేషనల్ టూర్‌లో భాగంగా పోలవరం ప్రాజెక్టుకు సెక్రటరీ డాక్టర్ సానా ప్రవీణ్ ఆధ్వర్యంలో అద్భుతంగా జరిగింది. ఈ బ్రందానికి క్లబ్ అధ్యక్షులు డా.గోపినాథ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ పర్యటన క్లబ్ చరిత్రలో విజ్ఞానవిహారయాత్రగా కొత్త సేవాకార్యక్రమంగా లిఖించబడుతు ందన్నారు. పోలవరం ప్రాజెక్టు యొక్క ఆవశ్యకతను మరియు బహుళ ప్రయోజనాలను ప్రాజెక్టు పూర్వపు విశ్రాంతి సీనియర్ ఇంజనీర్ సానా నాగేశ్వరరావు సభ్యుల బృందానికి వివరించడమే కాక ఆయా విభాగాల తాలూకు లక్ష్యాలను, నిర్మాణ శైలి మరియు ప్రయోజనాలను, కట్టడా లను చూపిస్తూ విశ్లేషించారు.తొలుత పోలవరం హెలిపాడ్ వ్యూ పాయింట్ నుండి పోలవరం ప్రాజెక్టును సభ్యుల బ్రందం చూశారు. తరువాత ప్రా జెక్టు ఇంజనీర్ల సహకారంతో ప్రపం చంలోనే అతి పెద్దదైన పోలవరం ప్రాజెక్టు మీదకు వెళ్లి హైడ్రాలిక్ గేట్లు నీటి నిలువ సామర్థ్యం ఎన్ని లక్షల ఎకరాలు పంట భూములకు నీరు అందుతుంది, ఎంత విద్యుత్తు ఉత్పత్తి అవుతుంది, దేశవ్యాప్త జల రవాణా ఏ రకంగా అనుసంధానించ బడుతుంది మొదలగు విషయాలు అన్నీ వివరించారు. ఈ ఆనకట్ట కుడి కాలువలు రెండు టన్నుల్స్ నుండి కొండ దాటి అనేక భూములను సస్యశ్యామలం చేసుకుంటూ కృష్ణా నదిలో కలుస్తాయి. అలాగే ఎడమ కాలువ టన్నల్ లేకుండా ఓపెన్‌గా రవాణా కోసం లాకులు ఏర్పాటు చేయబడింది. ఈ కాలువ విశాఖపట్నం వరకు ప్రవహించి పంట భూములను సస్యశ్యామలం చేయడమే కాకుండా పరిశ్రమల అవసరాలను ప్రజలకు తాగునీటిని కూడా అందిస్తుంది.

పర్యావరణ హితం అయిన ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు ఎడమవైపు చేపలకు ఎగువకు ఎగబాకే ఫిష్ లేడార్ అనే సన్నని అంచలంచలా మార్గమును ఏర్పాటు చేసారు. ఇది దిగువ ప్రాజెక్టు గోదావరి నుండి ఎగువ ప్రాజెక్టు రిజర్వాయర్‌కు చేపలు చేరుకొనడానికి సహజసిద్ధమైన ఏర్పాటు తద్వారా మత్స్య సంపద ఎగువ రిజర్వాయర్లు అపరిమితంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. చివరగా రిజర్వాయర్ నుండి టన్నెల్స్ ద్వారా దిగువ గోదావరిలోకి నీరు ప్రవహించే మధ్యలో 12 విద్యుత్ ఉత్పత్తి చేసే టర్బైన్లు ఏర్పాటు చేయుచున్నారు. వీటి ద్వారా 960 మెగావాట్ల నిరంతర జలవిద్యుత్తు ఆంధ్రప్రదేశ్‌కు లభించనుంది. ఈ ప్రాజెక్టు సుమారుగా 80 శాతం పూర్తి అయినదని, మరొక 20 శాతం 2027 లో పూర్తి అవుతుందని అన్నారు. కార్యక్రమంలో చిరంజీవి రెడ్డి, డి.వి.ఎన్. ప్రసాద్ వర్మ, చెలికాని సూర్యారావు, జోగా చంద్రరావు, (చందు) మోహన్ రావు, ధన సాగర్ ప్రసాద్, గోవిందరాజులు, సత్యమూర్తి, వై.ఎస్.ఎన్.సుబ్ర హ్మణ్యేశ్వర రావు తోపాటు పలువురు పాల్గొన్నారు.

# సేవలే నిలుచును.. చిరకాలం

- ఐదేళ్ల సేవలకు గౌరవ వందనం
- రామచంద్రపురం మున్సిపాలిటీ కౌన్సిల్‌కు ఘన వీడ్కోలు
- 'సత్యం వాసంశెట్టి ఫౌండేషన్' ఆధ్వర్యంలో సత్కారం



**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రజలకు, సమాజానికి చేసిన మంచి పనులే శాశ్వతంగా ప్రజల మదిలో నిలిచిపోతాయని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. రామచంద్రపురం మున్సిపాలిటీ కౌన్సిల్ పదవీకాలం మంగళవారంతో ముగిసిన నేపథ్యంలో చివరి అత్యవసర సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించబడింది. ఈ సమావేశంలో గత ఐదేళ్ల అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా చర్చించడంతో పాటు, పట్టణ ప్రగతిలో కౌన్సిల్ చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు.

అనంతరం జరిగిన ప్రత్యేక సత్కార కార్యక్ర మంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ లు పాల్గొని కౌన్సిల్ సభ్యులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఐదేళ్లపాటు కృషి చేసిన చైర్ పర్సన్, ప్రతి కౌన్సిలర్ అభినందనీయులు అని పేర్కొన్నారు. ఎంతకాలం పదవిలో ఉన్నామన్నది ముఖ్యం కాదని, ప్రజల మనసులో సుస్థిరమైన స్థానం సంపాదించుకోవడమే ప్రజాప్రతినిధులకు ఆత్మసంతృప్తి, గౌరవం అన్నారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి పట్టణానికి కొత్త దిశను చూపారని ఆయన కొనియాడారు. ప్రజలకు మెరుగైన సేవలు అందిం చడంలో అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించారని ప్రశంసలు కురిపించారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ రామచంద్రపురం నియోజకవర్గంలో మంత్రి సుభాష్ పార్టీలకు అతీతంగా అభివృద్ధి,సంక్షేమం చేస్తూ ముందుకు వెళుతున్నారన్నారు. విజయవంతంగా పదవీకాలం ముగించుకున్న ప్రజాప్రతినిధులందరికీ శుభాకాంక్షలు, ఘన వీడ్కోలు పలికారు.

అనంతరం సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవితో పాటు అన్ని వార్డుల కౌన్సిలర్లను జ్ఞాపికలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.వి.ఆర్.రాజు, డి.శ్రీకాంత్, మున్సిపల్ సిబ్బంది కూడా పదవీకాలం ముగిసిన ప్రజా ప్రతినిధులను ఘనంగా సత్కరించి వారు చేసిన సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతు సంక్షేమమే లక్ష్యం...

## విలువ ఆధారిత వ్యవసాయానికి ప్రోత్సాహం



– మాజీ ఎమ్మెల్యే 'పిల్లి'

**కాకినాడ రూరల్, మేజర్ న్యూస్ :** రైతు సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పలు కీలక కార్యక్రమాలను అమలు చేస్తోం దని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పిల్లి అనంత లక్ష్మి సత్యనారాయణ మూర్తి దంపతులు పేర్కొన్నారు. కొవ్వాడ, రేపూరు గ్రామాల్లో పర్య టించిన సందర్భంగా ఆయన రైతులతో సమావేశమై ప్రభుత్వ పథ కాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతులకు "రైతన్నా ... మీ కోసం" కరప త్రాన్ని అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రైతుల ఆదాయం పెంపు, పంటల భద్రత, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చే దిశగా ప్రభుత్వం సమగ్ర చర్యలు తీసుకుంటోందన్నారు. రైతు భరోసా, పంట బీమా, ప్రకృతి విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ వంటి పథకాల ద్వారా రైతు కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పిస్తున్నట్లు వివరించారు. పంటలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకుంటూ వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆధునిక సాంకేతికతను రైతులకు చేరువ చేయడానికి ఫార్మర్ యాప్ (ఏపీఏఐఎంఎస్ 2.0) ద్వారా పంటల నమోదు, సబ్సిడీలు, వివిధ సేవలను సులభంగా అందించే విధంగా వ్యవస్థను రూపొందిస్తున్నట్లు చెప్పారు. అలాగే నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటల ప్రోత్సాహం, అగ్రిటెక్ వినియోగం, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రైతు కేవలం ఉత్పత్తిదారుడిగానే కాకుండా విలువను సృష్టించే భాగస్వామిగా మారేలా ప్రాసెసింగ్, నిల్వ, విలువ ఆధారిత ఉత్పత్తుల రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. రైతు బాగుంటేనే దేశం అభివృద్ధి సాధ్యమని, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత లక్ష్య సాధనలో రైతు సంక్షేమం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో నారా చంద్రబాబు నాయుడు, అలాగే పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రైతులకు అండగా ప్రభుత్వం నిలుస్తోందని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామ పాలన పటిష్టం చేసేందుకు ప్రభుత్వం చర్యలు



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం గ్రామ పాలన పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకుంటుందని ఎంపీడీవో బి.కే.ఎస్.ఎస్. వెంకట్ రామన్ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ 9 అంశాలపై మండలంలోని అందరు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి స్థానిక పాలన వ్యవస్థ బలోపేతానికి సంబంధించి అత్యంత ప్రాధాన్యత కలిగినదని, గ్రామ పంచాయతీ స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేయుటకు వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని, శిక్షణలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణ అభివృద్ధి లక్ష్యాలను గ్రామ స్థాయిలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అమలు చేయుట ఎలా అనేది వివరిస్తూ, గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికలో చేర్చవలసిన 9 ప్రధాన అంశాలపై సమగ్ర అవగాహన కల్పించామ న్నారు. అలాగే గ్రామ సభల ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించి, స్థానిక అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటి ఎంపిడిఓలు పి.వి.ఆర్.కె. రాజు, కె.రమేష్ బాబు, పరిపాలనాధికారి వి.రామ స్వరూప్, శిక్షణ టి.ఓ.టి.లు యు.చంద్ర శేఖర్, కె.యశ్వంత్ కుమార్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఔషధ మొక్కల సాగులో ఆంధ్రప్రదేశ్ ముందంజ

మొదటిపేజి తరువాయి

రూ.4,508 కోట్లకు పెరిగినట్లు కేంద్రం తెలిపింది. రైతుల ఆదాయం పెంపు లక్ష్యంగా నాణ్యమైన నాట్లు అందించడం, అవగాహనకార్య క్రమాలు నిర్వహిం చడం, పోస్ట్–హార్వెస్ట్ సదుపాయాలను అభివృద్ధి చేయడంవంటి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొంది.

సూర్య www.suryaa.com

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678

అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు,
మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# రాజకీయాల్లో పదవీ విరమణ ఉండదు..

# ప్రజల్లో ఉంటేనే మానసిక ప్రశాంతత : మంత్రి కందుల దుర్గేష్

**– నిడదవోలు పురపాలక సంఘం 60 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంప్ ఆవిష్కరణ**



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** నిడదవోలు పట్టణ మున్సిపల్ కౌన్సిల్ హాలులో నేడు జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. నిడదవోలు పురపాలక సంఘం 60 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని, కేంద్ర పోస్టల్ శాఖ రూపొందించిన ప్రత్యేక పోస్టల్ కవర్, స్టాంపును మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు.

**– పదవీ విరమణ కాదు.. కేవలం విరామం మాత్రమే**
**: మంత్రి కందుల దుర్గేష్**

నేటితో నిడదవోలు మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఉద్యోగులకు రిటైర్మెంట్ ఉంటుంది కానీ రాజకీయ నాయకులకు ఉండదు. ఇది పదవీ విరమణ కాదు, కేవలం ఒక చిన్న విరామం మాత్రమే" అని పేర్కొన్నారు. గత ఐదేళ్లుగా పట్టణాభివృద్ధికి కృషి చేసిన మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణను, వైస్ ఛైర్మన్లను మరియు అన్ని పార్టీల కౌన్సిలర్లను ఆయన అభినందించారు.ప్రజల్లో నిత్యం ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, కౌన్సిలర్లు తమ పదవీకాలం ముగిసినా ప్రజల్లోనే ఉండి సేవ చేయాలని పిలుపునిచ్చారు. రాజకీయాల్లో పదవుల్లో ఉండటం, కోల్పోవడం సాధారణ అంశం అన్నారు. భవిష్యత్ జీవితం ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆశీర్వదిస్తూ శుభాభినందనలు తెలిపారు.

–అభివృద్ధికి చిరునామాగా నిడదవోలు:మంత్రి కందుల దుర్గేష్

గడిచిన 20 నెలల కాలంలోనే కూటమి ప్రభుత్వ సహకారంతో సుమారు 140 కోట్ల రూపాయల నిధులతో నిడదవోలును అభివృద్ధి పథంలో నడిపించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. గడిచిన రెండేళ్లలో పలువురు అధికార పార్టీలోకి రావడం వల్ల ఈ మున్సిపాలిటీ జనసేన వశం అయిందని, కూటమిలో జనసేన భాగస్వామ్యంకావడం వల్ల తాను మంత్రిగా ఉండటం వల్ల అభివృద్ధి వేగవంతం చేశామన్నారు.

–పట్టాల పంపిణీ

అనంతరం పురపాలక కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కందుల దుర్గేష్ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. నాయి బ్రాహ్మణ సంఘం, పండ్లు మరియు పూల వర్తకుల సంఘం, పట్టణ టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘాల వారికి కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి అవసరమైన స్థలాల పట్టాలను మంత్రి దుర్గేష్ పంపిణీ చేశారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం నిడదవోలు పట్టణం 10వ వార్డులో రజకుల కమ్యూనిటీ హాల్ మరమ్మతుల నిమిత్తం రూ.10 లక్షల నిధులు కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ మంత్రి కందుల దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

–ప్రజాసేవలో చలివేంద్రం ప్రారంభం

పెరుగుతున్న ఎండల దృష్ట్యా ప్రజల దాహార్తిని తీర్చేందుకు స్థానిక ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించారు. స్వయంగా ప్రజలకు మజ్జిగ, చల్లని తాగునీరు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కౌన్సిలర్లు, అధికారులు, వివిధ పార్టీల నేతలు, కూటమి నాయకులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి పరిశుభ్రతపై కాయకల్ప టీం ఆరా..

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన అడ్డతీగలలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం కాయకల్ప టీం సభ్యులు ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముందుగా రోగులకు అందుతున్న సేవలను అలాగే ఆసుపత్రిలోని గదులలో సిబ్బంది నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలు క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పరిసరాల పరిశుభ్రత శానిటేషన్ విధానం పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో సేవల పట్ల మెడికల్ ఆఫీసర్ మహేష్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రతి వార్డు తిరిగి జరుగుతున్న సేవలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సింగంపల్లి అరుణకుమారి స్టేట్ పిపిఎం కోఆర్డినేటర్ సుధా లలిత, జిల్లా క్వాలిటీ అష్యూరెన్స్



కన్సల్టెంట్‌తో పాటు స్థానిక వైద్యులు హర్ష అనుష రేష్మ సుల్తానా మస్తాన్ వల్లి కౌన్సిలర్ నారే వాసు హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# రైతన్నలు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలి

**– సొసైటీ ఛైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డెల్టా వైస్ ఛైర్మన్ సుధాకర్ రెడ్డి**



**అనపర్తి, మేజర్ న్యూస్ :** రైతు సోదరులు అధిక ఆదాయాన్ని పెంచుకునేందుకు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని, రసాయన ఎరువుల వాడకం తగ్గించుకుంటూ సేంద్రియ వ్యవసాయం అవలంబించడం వల్ల రైతు సోదరుల ఆదాయం పెరుగుతుందని అనపర్తి సొసైటీ ఛైర్మన్ కొవ్వూరి శ్రీనివాస రెడ్డి, ఈస్టర్న్ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం అనపర్తిలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, అధికారులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రతి రైతు కష్టం వృధా కాకుండా చూడడం, ఆదాయం పెరగడం ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండడం, ప్రతి రైతు గర్వంగా తలెత్తుకునే ఆంధ్రప్రదేశ్ నిర్మాణమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, అనపర్తి శాసన సభ్యులు నల్లమిల్లి రామకృష్ణా రెడ్డి ఆదేశాలు మేరకు " రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఈ కార్యక్రమం ద్వారా నేరుగా రైతుల కుటుంబాలని కలిసి సాగునీటి వనరులు, భూగర్భ జలాలను అత్యంత పొదుపుగా వాడుకోవాలని, వరి పంటే కాకుండా దేశ విదేశాల్లో డిమాండ్ ఎక్కువవున్నటువంటి కొబ్బరి, కాఫీ, కోకో వంటి పంటలను ప్రపంచ మార్కెట్లో అధిక డిమాండ్ ఉన్నటువంటి ఆయిల్ ఫామ్ పంటలను కూడా సాగు చేసుకోవాలని, పిచికారి మందులను డ్రోన్ల సహాయం తీసుకొని సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించుకోవాలని, సాధ్యమైనంతవరకు సేంద్రియ ఎరువులను వాడుకోవాలని సూచిస్తూ, సంక్షేమం నుంచి సంపద సృష్టించే వ్యవస్థను కూడా కూటమి ప్రభుత్వం బలోపేతం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మరియు పశుసంవర్ధక శాఖ అధికారులతో పాటు అనపర్తి మండల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రత్యేక అధికారి బాధ్యతలు స్వీకరణ

**– శానిటేషన్, త్రాగునీరు, పిజిఆర్ఎస్‌పై ప్రత్యేక దృష్టి సారించాలి**
**– ఆర్డీఓ ఎన్.శ్రీధర్**





**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం, తుని పురపాలక సంఘాల ప్రత్యేకాధికారిగా పెద్దాపురం ఆర్డీఓ ఎన్.శ్రీధర్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. దీనిలో భాగంగా మంగళవారం సాయంత్రం పెద్దాపురం మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి ఆర్డీఓ ఛాంబర్‌లో ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అలాగే తుని పురపాలక సంఘ ప్రత్యేకాధికారిగా నియమితులైన ఎన్.శ్రీధర్‌ను తుని మున్సిపల్ కమీషనర్ అప్పాబత్తుల వెంకట్రావు తన సిబ్బందితో ఆర్డీఓను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్డీఓ ఎన్.శ్రీధర్ తెలుపుతూ పురపాలక సంఘాలలో ప్రధానంగా శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే వేసవిని దృష్టిలో పెట్టుకుని త్రాగునీరు సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా స్వచ్ఛమైన త్రాగునీటిని పట్టణ ప్రజలకు సరఫరా చేయాలని, పిజిఆర్ఎస్ వినతులపై త్వరితగతిన స్పందించాలని, పౌరులకు మెరుగైన పాలన అందించాలని, కమీషనర్లకు ఆర్డీఓ సూచించారు.

## అధికారులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలి - ఛైర్‌పర్సన్

**కౌన్సిల్ సభ్యులకు ఘన సన్మానం**



**పెద్దాపురం,మేజర్ న్యూస్ :** అధికారులు అభివృద్ధిపై దృష్టిపెట్టాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు సూచించారు. మంగళవారం పెద్దాపురం పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వైస్‌ఛైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు త్రాగునీరు, వీధిలైట్లు, పారిశుద్యంపై దృష్టిపెట్టాలని, తెలిపారు. అనంతరం కౌన్సిల్ అజెండాలోని పలు అంశాలు, అభివృద్ధిపై చర్చించడం జరిగింది. అనంతరం కౌన్సిల్ పదవీకాలం ముగియడంతో కౌన్సిల్ సభ్యులను మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెండవ వైస్‌ఛైర్‌పర్సన్ కనకాల మహాలక్ష్మీ, మున్సిపల్ మేనేజర్ యు.జ్యోతిరాణి, మున్సిపల్ డిఇ కె.రాజారావు, ఆర్వో అచ్యుతరాజు, మున్సిపల్ టిపిఓ చింతా ఫణికుమార్, ఏఇలు ఉమామహేశ్వరి, పి.వి.సుధాకర్, స్వర్ణ జివిఎస్‌డబ్ల్యూఎస్ మేనేజర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, ఆర్ఐ గంగాధర్, కౌన్సిలర్ గుమస్తా అత్తిలి వీర్రాజు, సుభాషిణి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆకస్మిక తనిఖీలు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మండలం పెదబ్రహ్మదేవం గ్రామంలోని ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఆకస్మికంగా తనిఖీ మంగళవారం నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యత, పరిశుభ్రత, మెనూ అమలు వంటి అంశాలను పరిశీలించిన ఆయన, పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రభుత్వ పథకాలఅమలులో ఎలాంటి లోపాలు ఉండకూడదని హెచ్చరిస్తూ, విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలన్నారు

# బ్లాక్ మార్కెట్లో గ్యాస్, మహిళలకు కన్నీళ్లు

**– రాష్ట్ర అయ్యారక కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అవాల రాజేశ్వరి లక్ష్మీనారాయణ**



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం అవగాహన లేని పరిపాలనే కారణంగా నిత్యావసర వస్తువు అయిన గృహావసర గ్యాస్ సిలిండర్లు కొరత ఏర్పడిందని, ఈ కారణంగా ప్రధానంగా ప్రతీ ఇంట మహిళ కన్నీరు కారాల్సిన దుస్థితి ఏర్పడిందని రాష్ట్ర ఆయ్యారక కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అవాల రాజేశ్వరి లక్ష్మీనారాయణ కూటమి ప్రభుత్వంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. సోమవారం సామర్లకోటలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఒక పక్క అధికార యంత్రాంగం గ్యాస్ లభ్యత పై ప్రకటస్తున్న సమాచారానికి క్షేత్రస్థాయిలో గ్యాస్ కోసం వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎక్కడా పొంతన లేదని ఆరోపించారు. గ్యాస్ సిలిండర్ ల బుకింగ్ చేద్దామంటే ఏ గ్యాస్ ఏజన్సీ ల ఫోన్ నంబర్లు పనిచేయడమే లేదన్నారు. దీంతో స్వయంగా గ్యాస్ ఏజన్సీ ల వద్దకు బుకింగ్ కోసం వెళ్లినా డీలర్లు నుంచి స్పందన లేదని ఆరోపించారు. దీంతో గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతు న్నాయని ఆరోపించారు. ఈ సమయంలో తనికీలు నిర్వహించాలిసిన సివిల్ సప్లయ్ అధికారులు మొక్కుబడి తనికీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. ఎటువంటి బ్లాక్ మార్కెట్ లేకుండా నిత్యావసర వస్తువు అయిన గ్యాస్ సిలిండర్ల సరఫరా పై ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 20 లక్షల 12 వేల 985 కనిష్టను ఉండగా రోజూ వారీ వినియోగం 38.వేల సిలిండర్ల వరకూ ఉందని పేర్కొన్నారు. ఆయితే ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా రోజుకు 10 వేల సిలిండర్ల ను మాత్రమే సరఫరా చేయగలుగుతున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను మరుగుపెట్టి గ్యాస్ కొరత లేదంటూ అమాయకపు మహిళలను మభ్యపెట్టి ప్రచారాలు చేయడం దుర్మార్గమన్నారు. ఇంటి వంట కోసం మహిళలు పడుతున్న గ్యాస్ కష్టాలను సత్వరం స్పందించి అందరికీ గ్యాస్ సమృద్ధిగా సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోకుంటే మహిళలతో పెద్ద ఎత్తున గ్యాస్ ఉద్యమం చేపట్టనైనట్ల రాష్ట్ర ఆయ్యారక కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ అవాల రాజేశ్వరి లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# ధాన్యం కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించాలి




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** ఆర్డీఓ కార్యాలయంలో పెద్దాపురం మండలానికి సంబంధించి, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గల సిబ్బందికి రబీ సీజన్ ధాన్యం కొనుగోలుపై అవగాహన సదస్సు మరియు ట్రైనింగ్ శిక్షణా కార్యక్రమం మంగళవారం ఏఓ సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ముందస్తు చర్యలు తీసుకోవాలని రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు చేపట్టాలని, నాణ్యత ప్రమాణాలపై రైతులకు అవగాహన కల్పించాలని ఏఓ సూచించారు. ఈ కార్యక్రమంలో సి.ఎస్.డి.టి.భారతి, సివిల్ సప్లైస్ సిబ్బంది, వీఏఏలు, వీహెచ్ఏలు, వీఆర్వోలు, ధాన్యం కొనుగోలు సిబ్బంది పాల్గొన్నారు.

# అత్యంత భక్తి శ్రద్ధలతో

# జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు




**– ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు**

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాజమహేంద్రవరంలోని స్థానిక పందిరి ఫంక్షన్ హాల్‌లో జిల్లా స్థాయి ఇఫ్తార్ విందు ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సభాధ్యక్షులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మరియు కలెక్టర్ కీర్తి చేకూరి కలిసి ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మైనార్టీ సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున హాజరై ఆధ్యాత్మిక వాతావరణంలో ఇఫ్తార్ ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం కట్టుబడి ఉందని తెలిపారు. మైనార్టీల మనోభావాలను గౌరవిస్తూ ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తార్ విందు నిర్వహించడం అభినందనీయమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులపై అల్లా కృప ఉండాలని ఆకాంక్షించారు. వక్ఫ్ బోర్డు ఆస్తుల సంరక్షణతో పాటు మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాజమహేంద్రవరం నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా కృషి చేస్తున్నట్లు, అదే విధంగా తమ ట్రస్టు ద్వారా పలు కార్యక్రమాలను అంద చేస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసం ఆధ్యాత్మికత, నియమనిష్ఠలకు ప్రతీక అని తెలిపారు. ఉపవాస దీక్షల అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదర సోదరీమణులు శాంతి, సామరస్యాలతో ప్రార్థనలు నిర్వహించడం సమాజానికి మంచి సందేశమ న్నారు. జిల్లాలోని ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.వై.మేఘా స్వరూప్, జాయింట్ కలెక్టర్, తమ సందేశంలో రంజాన్ మాసం ఆత్మపరిశుద్ధి, దైవభక్తికి ప్రతీక అని పేర్కొన్నారు. ఉపవాసం మనలో నియమనిష్ఠలను పెంపొందించి సేవాభావాన్ని పెంచుతుం దన్నారు. పరస్పర గౌరవం, ప్రేమ, దాతృత్వం వంటి మానవ విలువలను బలపరిచే ఈ పవిత్ర మాసాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమాజంలో ఐక్యత, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు అందరూ కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసం సౌభ్రాతృత్వం, సామరస్యానికి ప్రతీక అని తెలిపారు.

ఇఫ్తార్ విందులు పరస్పర గౌరవాన్ని పెంపొందిస్తాయని పేర్కొంటూ జిల్లా ప్రజలకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, అదనపు ఎస్పీ ఎల్ చెంచు రెడ్డి, ఇంచార్జి ఆర్డీవో కె భాస్కర్ రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యద్ అఫ్సరి, మైనార్టీ మత పెద్దలు మహమ్మద్ అబ్దుల్లా, మహమూద్ జానీ, భాషా నిమ్రా, రెఫిక్ రాజా, షేక్ బషీర్, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, ముస్లిం సోదర సోదరీమణులు, పలు శాఖల జిల్లా అధికారులు హాజరయ్యారు.

## జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమం




**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** జనసేన పార్టీ ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా 500 పైగా సభ్యత్వాలు నమోదు చేసిన రాజమండ్రి రూరల్ నియోజకవర్గానికి చెందిన జనసేన సాధక్ విజ్ఞన శివకి అభినందనలు పలువురు తెలిపారు.

## మత్స్యకారులను ఆదుకునేందుకు మత్స్య సంపద యోజన పథకం - జ్యోతుల



**జగ్గంపేట, మేజర్‌న్యూస్ :** మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మత్స్యశాఖ సహాయ తనిఖీ అధికారి కార్యాలయ పరిధిలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం (పి ఎం ఎం ఎస్ వై) లో లబ్ధిదారులైన జగ్గంపేట గ్రామానికి చెందిన మత్స్యకారుడు కొత్తపల్లి మోహన్ రావు కి 60 శాతం సబ్సిడీతోను జగ్గంపేట మండలం జే కొత్తూరు గ్రామానికి చెందిన రాయుడు సాయిరాం 40శాతం సబ్సిడీతో మంజూరైన మూడు చక్రాల ఆటోలు, ఐస్ బాక్స్ లు జ్యోతుల నవీన్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పి ఎం ఎం ఎస్ వై) కింద మత్స్యకారులకు ఐస్ బాక్స్‌లతో కూడిన ఆటోలు (మూడు చక్రాల) సబ్సిడీపై పంపిణీ చేయబడుతున్నాయన్నారు.. ఈ పథకంలో భాగంగా ఆటోలపై, వెనుకబడిన వర్గాలకు 60 శాతం జనరల్ కేటగిరీకి కు 40 శాతం ఆర్థిక సహాయం అందుతుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, బురి సత్తిబాబు, దేవరపల్లి మూర్తి, రాయి సాయి తుమ్మల కిషోర్, చింతల కన్నారావు, మత్స్య శాఖ సహాయ సంచాల కులు ఎం లావణ్య , మత్స్యశాఖ తనిఖీ అధికారి కర్రీ రామకృష్ణ, మత్స్య శాఖ సహాయకురాలు కె పద్మ, పీలా మహేష్, బద్ది సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## కీటక జనిత వ్యాధులపై అవగాహన



**పెరవలి, మేజర్ న్యూస్ :** కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.హేమరాజు ఆధ్వర్యంలో మార్చ్ 17 వ తేదీ మంగళవారం కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఉసులుమర్రు గ్రామంలో కీటక జనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం అయినప్పటికీ డెంగ్యూ చికున్ గున్యా వంటి వ్యాధులను వ్యాప్తి చేసేది ఏడిస్ ఈజిప్టై దోమ అని,ఈ దోమకు "పులి దోమ" అనే పేరుందని,ఈ దోమలు పాత ఫ్రిజ్ ల వెనుక ఉండే కంప్రెసర్ ట్రే లో నిల్వఉన్న నీటిలో గుడ్లు పెడతాయని ఇవి 8 నుండి 10 రోజుల్లోగా దోమలుగా మారతా యని, వీటిలో వైరస్‌తో ఇన్ఫెక్ట్ అయిన దోమలు కుడితే డెంగ్యూ, చికున్ గున్యా వంటి వ్యాధులు రావడానికి అవకాశం ఉంటుం దని,వారానికి ఒక సారి స్విచ్ ఆఫ్ చేసి,ట్రేలో ఉన్న నీటిని ఎండలో రోడ్ పై,ఇంటి ఆవరణలో సిమెంట్ ఫ్లోర్ పై వేయాలని తద్వారా ఏడిస్ ఈజిప్టై దోమ పుట్టుకకు చెక్ పెట్టాలని కోరారు. ఈ కార్యక్ర మంలో హెల్త్ సూపర్వైజర్ కె.వి.నాగేశ్వరరావు, ఎం.ఎల్. హెచ్.పి. బి. జ్యోతి కుమారి,విలేజ్ హెల్త్ సెక్రెటరీ జి. భాగ్యలక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ వి.రాజశేఖర్ మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# పదవీకాలం ముగిసింది

**– ప్రజాసేవ మిగిలే ఉంది**

**– తుది శ్వాస వరకు ప్రజాసేవలోనే కొనసాగుతా**

**– ఏలేశ్వరం చైర్ పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య**



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** పదవీకాలం ముగిసిన ప్రజలకు చేయాల్సిన సేవ ఇంకా మిగిలే ఉందని ఏలేశ్వరం నగర పంచాయతీ చైర్పర్సన్ అలమండ సత్యవతి చలమయ్య వెల్లడించారు. సోమవారంతో నగర పంచాయతీ చైర్పర్సన్ పదవీకాలం ముగియడంతో వారి అభిమానులు అలమండ దంపతులను సత్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ సత్యవతి చలమయ్య మాట్లాడుతూ 1992లో పర్వత సుబ్బారావు దంపతుల ప్రోత్సాహంతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించామన్నారు. అప్పటినుంచి ప్రజాసేవలో కొనసాగుతూ 2001లో ఏలేశ్వరం పంచాయతీ సర్పంచ్ గా ఎన్నికై ఐదు సంవత్సరాలు దిగ్విజయంగా పంచాయతీ నీ అభివృద్ధి పదం వైపు నడిపించానన్నారు. అప్పటి ఎమ్మెల్యే పర్వత దంపతుల ప్రోత్సాహంతో పంచాయతీని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. అలాగే అద్వాన్నంగా ఉన్న రోడ్లను సిమెంట్ రోడ్లుగా అభివృద్ధి చేసామన్నారు. ఏలేశ్వరం త్రాగునీటికి కేవలం ఒకే ఒక్క ట్యాంక్ పై ఆధారపడి ఉండగా తాము అధికారం చేపట్టిన తర్వాత ఏ ఎం జి వంటి స్వచ్ఛంద విద్యాసంస్థలు, మణిహంస పవర్ ప్రాజెక్ట్ సహకారంతో స్థానికంగా నీటి ఎద్దడి లేకుండా 2 రక్షిత మంచినీటి ట్యాంకులను నిర్మించడం జరిగిందన్నారు. అనంతరం 2019లో పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ప్రోత్సాహంతో నగర ప్రజలు తమకు చైర్మన్ పదవిని అప్పగించి తనపై మరింత బాధ్యతను పెంచారు అన్నారు. అప్పటినుండి నిరంతరం నగర అభివృద్ధికి కృషి చేస్తూ దిగ్విజయంగా ఐదు సంవత్సరాలు పదవీకాలం పూర్తి చేయడం జరిగిందన్నారు. కొన్ని రాజకీయ కారణాల దృశ్య తాను వైసీపీ నుండి తెలుగుదేశంలోకి చంద్రబాబు నాయుడు లోకేష్ ల ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలోకి చేరమన్నారు. ప్రత్తిపాడు శాసనసభకు పోటీ చేసిన వరుపుల రాజా సతీమణి సత్య ప్రభ ను అత్యధిక మెజారిటీతో విజయం సాధించేందుకు సాయ శక్తుల కృషి చేశామన్నారు. తను పదవి అలంకరించిన ఐదు సంవత్సరములలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయానని కాస్త నిరుత్సాహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమకున్న వెసులుబాటును బట్టి నిధులు కేటాయిస్తే దానితోనే సర్దుకోవాల్సి వచ్చింది అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి డ్రైనేజీలు, రహదారులు వంటివి అభివృద్ధి చేయడం జరిగిందన్నారు.

స్థానిక సంస్థలకు కనీసం స్థానిక సమస్యలపై స్పందించే ఎసులుబాటు కలిగినప్పుడే పూర్తిస్థాయిలో అభివృద్ధిపరిచేందుకు అవకాశం కలుగుతు ఒదన్నారు. గ్రామ పరిపాలనకు అభివృద్ధికి సొంత నిర్ణయాలు తీసుకునే అధికారం చైర్మన్‌కి లేకపోవడం దురదృష్టకరమన్నారు. అలాగే అభివృద్ధి చేసిన పనులకు కూడా తొందరగా నిధులు మంజూరు కాకపోవడంతో పనులు పూర్తి చేసేందుకు గుత్తేదారులు ముందుకు రాకపోవడం మరో కారణంగా అని చెప్పారు.

# యువకులు క్రీడలతో పాటు విద్యా రంగంలో రాణించాలి

**– యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలి**

**– ముర్వా శ్రీనివాస్**



**ఎటపాక, మేజర్ న్యూస్ :** యువకులు క్రీడలతో పాటు విద్యా రంగంలో రాణించాలి అని, ముఖ్యంగా చెడు వ్యాసనాలకు బానిస అవ్వరాదు అని టీడీపీ సీనియర్ నాయకులు ముర్వా శ్రీనివాస్ అన్నారు. పోలవరం జిల్లా ఎటపాక మండలం మేడువాయి గ్రామంలోని డా. పాల్‌రాజ్ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్లో భద్రాద్రి యువ ఆధ్వర్యంలో జరుగుతున్న భద్రాద్రి యువ టీ–10 మెగా ఆక్షన్ క్రికెట్ టోర్నమెంట్లో భాగంగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా కొనసాగుతున్నాయి.మంగళవారం జరిగిన రెండవ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చిన్ని–11 మరియు గోదావరి–11 జట్లు తలపడ్డాయి. ప్రారంభం నుంచి ఆఖరి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో గోదావరి–11 జట్టు అద్భుత ప్రదర్శనతో విజయం సాధించింది.ఈ మ్యాచ్‌లో బ్యాటింగ్ మరియు బౌలింగ్‌లో సమగ్ర ప్రదర్శన కనబరిచిన నితిన్ (8 బంతుల్లో 15 పరుగులు, 2 వికెట్లు) మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు. ఆయనకు ఈ అవార్డును పోలవరం జిల్లా సీనియర్ టీడీపీ నాయకులు ముర్వ శ్రీను, ఎటపాక సర్పంచ్ వెంకటేష్ చేతుల మీదుగా అందజేశారు. టోర్నమెంట్‌లో భాగంగా జరుగుతున్న ప్రతి మ్యాచ్ కూడా ప్రేక్షకులకు ఉత్కంఠను కలిగిస్తూ, భద్రాద్రి ప్రాంత యువ క్రీడాకారుల ప్రతిభను ప్రతిఫలింపజేస్తోంది. గ్రామీణ స్థాయిలో ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా యువతలో క్రీడాస్ఫూర్తి, జట్టు భావన మరింత బలపడుతున్నాయని ముర్వ శ్రీను తెలిపారు.ఈ కార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు కుంజా సంతోష్, పందా అమృతరావు (అంబు), తాళ్ళ నాగరాజు, తాళ్ళ రమేష్, శీలం నాగరాజు, నాగార్జున, గోపి, సుమన్, భార్గవ్, శ్యామ్, మున్నా భాయ్, ప్రశాంత్, శాంత కుమార్, రవి, చింటు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో ఉగాది కానుక దివ్యాంగ శక్తి పథకం..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగ శక్తి పథకం ద్వారా, ఉగాది కానుకగా మార్చి 18వ తేదీ నుండి ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించబడుతుందని ఏలేశ్వరం ఆర్టీసీ డిపో మేనేజర్ జీవి సత్యనారాయణ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు , సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ అనే ఐదు రకాల బస్సులలో ఈ దివ్యంగా శక్తి పథకం వర్తిస్తుందని ఆయన వివరించారు. ప్రస్తుతం 40 శాతం కంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న దివ్యంగులకు, 100% కంటి చూపు లేని వారికి, 100 శాతం మూగ చెవిటి వారికి, అలాగే 40% కంటే ఎక్కువ వైకల్యం ఉన్న మానసిక దివ్యాంగులు మాత్రమే ఏపీఎస్ఆర్టీసీ సిటీ ఆర్డినరీ బస్సులలో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులలో వీరికి 50% రాయితీ లభిస్తుంది. అయితే ఈ దివ్యంగా శక్తి పథకం కింద దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ పొందిన వారందరికీ ఈ పథకం వర్తిస్తుం దన్నారు, అలాగే వారి సదరం సర్టిఫికెట్‌లో ఉన్న సహాయకులకు కూడా ఈ బస్ లలో 50% రాయితీ లభిస్తుందని ఈ సందర్భంగా డిపో మేనేజర్ జీ వి సత్యనారాయణ తెలియజేశారు. ఈ దివ్యాంగ శక్తి పథకం బుధవారం ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గం ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ నూతనంగా ప్రవేశపెట్టిన పథకాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా డిఎం సత్యనారాయణ సూచించారు.

## విద్యార్థులకు సైబర్ నేరాలు, రహదారి భద్రతపై అవగాహన



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం మండల కేంద్రమైన అడ్డతీగలలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సైబర్ నేరాలు, రహదారి భద్రత వంటి అంశాలపై స్థానిక పోలీస్ సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆపరేషన్ వజ్రప్రహార్‌లో భాగంగా అడ్డతీగల సిఐ నరసింహమూర్తి ఎస్సై వినోద్ వారి సిబ్బందితో కలిసి పాఠశాలల్లో చదువుతున్న 150 మంది విద్యార్థులకు ఎన్ డి పి ఎస్ చట్టం సైబర్ నేరాలు వంటి వాటిపై విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో దృశ్యాత్మకంగా వివరించారు. అలాగే సెలవుల్లో విద్యార్థులు ప్రయాణాలు సాగించేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు పాటించవలసిన రహదారి నియమాలు పాటించకపోతే వచ్చే అనర్థాలు వంటి వాటిని వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యుడు ప్రభాకర్ ఇతర ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# పలేరియా కిట్లు పంపిణీ



**అల్లవరం, మేజర్ న్యూస్ :** అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి చేతుల మీదుగా పలేరియా కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరి ఇంటి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపాలని చిన్న చిన్న వ్యాధులు వచ్చినప్పుడు మన గ్రామంలో ఉన్నటువంటి గవర్నమెంట్ హెల్త్ సెంటర్ లకు వెళితే మెరుగైన వైద్యాన్ని ప్రభుత్వం మనకు అందిస్తుందని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడపా వెంకటేశ్వరరావు, తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షులు అరవ చంటి, జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు రోళ్ళ శ్రీను, పాలకవర్గ ఓలేటి పరమేశ్వరరావు, చింతం శ్రీను, దొమ్మేటి రాధాకృష్ణ, హెల్త్ సుపర్వైజర్ సాపే సత్యనారాయణ, ఎంఎల్‌హెచ్‌పీలు, రాపాక సౌమ్య, నల్లి విజయ, ఎఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్ లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీనూకాలమ్మ అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పణ

**– గ్రామంలో ఆధ్యాత్మిక శోభ**





**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రాజవొమ్మంగిలో పురాతన చరిత్ర కలిగిన శ్రీశ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారికి మహిళా భక్తులు భారీ ఎత్తున పాల్గొని భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. స్థానిక సర్పంచ్ గొల్లపూడి రమణి, సోదరులు గొల్లపూడి పెద్దిరాజు ఆధ్వర్యంలో రవీంద్ర నగర్, విద్యానగర్, శాంతినగర్, పి డబ్ల్యుడి వీధి తదితర గ్రామాల నుండి మహిళా భక్తులు అమ్మవారి ప్రతిరూపాలైన బోనాలను ధరించి గ్రామ పురవీధుల్లో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కనులు పండుగగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నేత దంతులూరి శివరామచంద్రరాజు, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ లోత లక్ష్మణరావు, జట్టు మధు, మాకిరెడ్డి లోవ, ఆలయ కమిటీ సభ్యులు, కూటమి నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అండర్-14 గిరిజన బాల బాలికల ఎంపిక







**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన బాల బాలికలకు ఈనెల 16, 17 తేదీల్లో రెండు రోజులపాటు క్రీడా ప్రతిభ వెలికి తీసేందుకు 'టాలెంట్ హంట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలవరం జిల్లా పరిధిలోని 12 మండలాలకు చెందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో విద్య అభ్యసిస్తున్న గిరిజన బాల బాలికలకు రంపచోడవరం ఏపిటిడబ్ల్యూఆర్ స్కూల్ మైదానంలో ఈ ఎంపికలు నిర్వహించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల పరిధిలో 14 సంవత్సరాల లోపు గిరిజన విద్యార్థినీ విద్యార్థుల్లోని క్రీఢా ప్రతిభ వెలికి తీసేందుకు 'టాలెంట్ హంట్' పేరిట వివిధ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ లో సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించడం జరిగింది.

ఆయా గేమ్స్ అండ్ స్పోర్ట్స్‌కు సంబంధించి నిర్వహించిన టెస్ట్‌ల వివరాలు నిర్వాహకులు తెలిపారు. 1) బ్యాటరీ టెస్ట్ లు, 2) స్కిల్ టెస్ట్ లు, 3) అథ్లెటిక్స్ (బాల బాలికలు), లాంగ్ జంప్, జావెలిన్ త్రో, 400మీటర్లు, /800 మీటర్లు రన్, 4) హాకీ (బాలికలు), 5) ఫుట్ బాల్ (బాలికలు), 6) ఆర్చరీ (బాల బాలికలు), 7) ఖో- ఖో (బాలికలు), 8) బాక్సింగ్ (బాల బాలికలు), 9) వెయిట్ లిఫ్టింగ్ (బాలికలు) లలో క్రీఢా నైపుణ్యాలు చూసి, తద్వారా పాయింట్లు ఇచ్చి ఎవరికైతే ఎక్కువ పాయింట్లు వచ్చాయో వారికి - ఖేలో ఇండియా సెంటర్, కడప స్పోర్ట్స్ స్కూల్ లో ప్రవేశం కల్పించడం జరుగుతుందన్నారు.

ఈ కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ అఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) డైరెక్టర్ కొవ్వాసి జగదీశ్వరి, ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ స్పోర్ట్స్ ఆఫీసర్ (శాప్ ఏపిటిఎస్ఓ) రమణ, పాడేరు డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ (డిఎస్డివో) జగన్మోహన్ రావు, ఏలూరు డిఎస్డివో అజీజ్ ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సెలెక్షన్స్ నిర్వహించేందుకు 22 మంది కోచ్ లు, 12 మండలాల నుండి 50 మంది పీడిలు, పియిటీ లు హాజరయ్యారు. 400 మంది బాల బాలికలు ఈ సెలక్షన్ లలో పాల్గొన్నారని పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం స్పోర్ట్స్ కోఆర్డినేటర్, పూర్వపు అల్లూరి సీతారామరాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి కంగల పోతురాజు, జిల్లా అధ్యక్షులు విండెల కృష్ణారావు తెలిపారు.

# విక్టరీ బజారులో లక్కీ డ్రా

**- నాణ్యమైన ఉత్పత్తులు అమ్మడమే విక్టరీ లక్ష్యం**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** పట్టణాలతో పోటీ పడేవిధంగా రూరల్,పంచాయతీ ఏరియా లలో వ్యాపారాన్ని కొనసాగిస్తున్న విక్టరీ సూపర్ బజార్ ఆధ్వర్యంలో జడెన్ స్కిన్ కేర్ ప్రొడక్ట్స్ కంపెనీ వారి ఆధ్వర్యంలో లక్కీ డ్రా మంగళవారం రావులపాలెంలోని విక్టరీ బజారు ఆవరణలో అధినేత విక్టరీ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ వ్యాపారాభివృద్ధితో పాటు వినియోగదరులను ప్రోత్సహించే విధంగా కస్టమర్‌లకు అందజేయడం జరిగిందని మంగళవారం డ్రా తీయడం జరిగిందాని అందులో 10మందికి స్కూటీలను, 10మందికి మూడు లీటర్ల కుక్కర్‌లను 10మందికి గ్యాస్ స్టవ్‌లను, 13 మందికి కానసొలేషన్స్ బహుమతులు రూపంలో అందజేయడం జరిగిందని వారు తెలిపారు.అలాగే విక్టరీ అనేది వినియోగదరులకు అంత్యంత ఉత్తమ, నాణ్యమైన ఉత్పత్తులను అందుబాటు ధరలలో అందించడమే మా లక్ష్యం అని, జెడన్ స్కిన్ కేర్ ప్రోడక్ట్ అద్భుతంగా ఉందని, ఇది ఇక్కడ వాతావరణంకు అనువైన ప్రోడక్ట్ అని అందుకు నిదర్శనం భారీగా ఈ ఉత్పత్తి అమ్ముడుకావడమే అని వారు పేర్కొన్నారు.

# 'బీవీసీ'లో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్



**అల్లవరం, మేజర్ న్యూస్ :** ఓడలరేవు: స్థానిక బోనం వెంకట చలమయ్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏప్రిల్ ఒకటవ తేదీ నుండి ఉచిత పాలిటెక్నిక్ ఎంట్రన్స్ కోచింగ్ (పాలిసెట్ 2026) ఇవ్వబడుతుందని కళాశాల చైర్ పర్సన్ డాక్టర్ బోనం కనకదుర్గ ఒక ప్రకటనలో తెలియజేశారు. తూర్పుగోదావరి జిల్లాలో మొట్టమొదటి సాంకేతిక విద్యాసంస్థగా ఆవిర్భవించిన ఓడలరేవు బివిసి ఇంజనీరింగ్ కళాశాల అత్యంత అనుభవజ్ఞులైన విషయ నిపుణులచే పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు ఈ కోచింగ్ ఇవ్వనున్నామనీ, ఈ సదవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలనీ తెలియజేశారు.

ఫీజు రీయింబర్స్మెంట్ సౌకర్యంతో చక్కటి ఉపాధి అవకాశాలు కలిగిన డిప్లమో విద్యను పొందటానికి పాలీసెట్ ద్వారా మార్గం సుగమమవుతుందని,కోచింగ్ నకు ఓడలరేవు కళాశాల వరకు వివిధ ప్రాంతాల నుండి ఉచిత రవాణా సదుపాయంతో పాటు ఈ కోచింగ్‌ని పూర్తిగా ఉచితంగా ఇవ్వనున్నట్లు వివరించారు. రానున్న విద్యా సంవత్సరం నుండి తమ కళాశాలలో డిప్లమో కోర్సులు ప్రారంభిస్తున్నామని, కళాశాలకు వచ్చి ఇక్కడి అధునాతన ల్యాబ్ సౌకర్యాలు, ఇతర సదుపాయాలు కూడా పరిశీలించి విద్యార్థులు లేదా వారి తల్లిదండ్రులు ఈ ఉచిత కోచింగ్ కు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలియజేశారు మరిన్ని వివరాలకు 9866305649,9652477602 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చని తెలియజేశారు.

# పిఠాపురం పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా వానపల్లి రమణ



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** భారతీయ జనతా పార్టీ పిఠాపురం పట్టణ ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా వానపల్లి రమణ నియమితులయ్యారు. మంగళవారం పిఠాపురం పట్టణ శాఖ అధ్యక్షులు ఓలేటి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ?ఈ సందర్భంగా ఓలేటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... వానపల్లి రమణ తన నాయకత్వంలో పట్టణంలోని ఓబీసీ మోర్చా కమిటీని పటిష్టం చేసి, పార్టీ బలోపేతానికి చురుగ్గా కృషి చేయాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ఓబీసీల అభివృద్ధి కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. నూతనంగా నియామకమైన వానపల్లి రమణకు పార్టీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు పెద్ద ఎత్తున అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బుర్రి మురళీధర్ రావు, దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు, పట్టణ ఉపాధ్యక్షులు గరగ వీరబాబు,బండే శ్రీనివాసు,పెద్దింట్ రెడ్డి, జనరల్ సెక్రెటరీలు కంబాల నాగేశ్వరావు, దొడ్డి లక్ష్మీనారాయణ, సెక్రటరీ అద్దంకి పార్థసారథి, అల్లుబోయిన నంద్ కిషోర్, జిల్లా కార్యవర్గ సభ్యులు అడబాల వీర మోహన్ రావు, కోవెల సుప్రియదేవి, ఓబీసీ జిల్లా కోశాధికారి ఏలూరి సూర్యనారాయణ, నాయకులు యాళ్ల కృష్ణారావు, పసుపులేటి సత్తిబాబు, అల్లుబోయిన సూరిబాబు, చింతపల్లి సింహాద్రి, స్వామి రెడ్డి కామేశ్వరరావు తదితరులు పాల్గొని రమణకు శుభాకాంక్షలు తెలిపారు.

# కాకినాడను క్లీన్ సిటీగా తీర్చిదిద్దే దిశగా కఠిన చర్యలు

**- కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నగరాన్ని పరిశుభ్రంగా, శుభ్రత ప్రమాణాలతో తీర్చిదిద్దేందుకు నగరపాలక సంస్థ పలు కఠిన చర్యలు చేపడుతోందని కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం జగన్నాథపురం 5వ సర్కిల్ పరిధిలోని మస్తార్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విధులకు హాజరుకాని సిబ్బంది అటెండెన్స్‌ను పరిశీలించి, సంబంధిత సానిటరీ ఇన్స్పెక్టర్ ధర్మరాజును వివరణ కోరారు.అనంతరం 16, 17 డివిజన్లలోని ఏటిమొగ ప్రాంతాల్లో కూటమి నాయకులతో కలిసి విస్తృతంగా పర్యటించిన కమిషనర్, పారిశుధ్య పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో నేరుగా మాట్లాడిన ఆయన, తడి చెత్త-పొడి చెత్త వేర్వేరుగా వేరు చేస్తున్నారా అనే అంశాన్ని పరిశీలించారు. కాలువల శుభ్రత పనులు నిత్యంగా జరుగుతున్నాయా అనే విషయంపై అధికారులను ప్రశ్నించిన కమిషనర్, త్రాగునీటి సరఫరా, నాణ్యతపై ప్రజల అభిప్రాయాలను సేకరించారు. నీటి నాణ్యతకు సంబంధించిన ప్రాథమిక పరీక్షలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కాకినాడను "క్లీన్ సిటీ"గా మార్చాలంటే ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ డివిజన్లలో స్వచ్ఛతపై మరింత అవగాహన అవసరమని, ప్రజల్లో బాధ్యతాయుతమైన మార్పు రావాలని పిలుపునిచ్చారు.పర్యటనలో కొంతమంది రోడ్లపై కట్టెల పొయ్యిలు ఏర్పాటు చేయడం, ఆహార అవశేషాలను పారవేయడం వంటి ఘటనలను గుర్తించిన కమిషనర్, వాటిని ప్రజల చేతనే తొలగింపజేసి డస్ట్‌బిన్‌లలో వేయించారు. రోడ్లపై ఆహార పదార్థాలు పారవేయకుండా ఉండాలని హెచ్చరిస్తూ, ఇలాంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కే.టీ.సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వి చరణ్, ఈఈ కనకారావు, సానిటరీ ఇన్స్పెక్టర్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

# పాడా ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా బీహెచ్.భవాని శంకర్ బాధ్యతల స్వీకరణ..



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం ప్రాంత అభివృద్ధి అథారిటీ (పాడా) ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బిహెచ్.భవాని శంకర్ మంగళవారం పిఠాపురం పాడా కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కాకినాడ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పాడా చైర్మన్, జిల్లా కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

# రాజపూడి డ్వాక్రా యానిమేటర్‌పై చర్యలు తీసుకోవాలి

-అధికారులను సస్పెండ్ చేయాలి
-కర్నాకుల డిమాండ్



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** రాజపూడి గ్రామంలో కృప మహిళా శక్తి సంఘం గ్రూపు సభ్యులను మోసం చేసి సొమ్ములు కాజేసిన యానిమేటర్ పై చర్యలు చేపట్టాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గ్రూపు సభ్యులు 2022లో 15 లక్షల రూపాయలు బ్యాంకు రుణం తీసుకోవడం జరిగిందన్నారు.. తీసుకున్నప్పటి నుంచి 32 నెలల పాటు ఒక్కొక్కరు 3,100/- చొప్పున నెలకు 31,000/- రూపాయలు కట్టి త్వరగా తీరిపోతుందని నెలకు 4,100/- చొప్పున నెలకు 41,000 ప్రెసిడెంట్ తీసుకువెళ్లి గ్రామ యానిమేటర్ హైమావతి కి ఇవ్వడం జరిగిందని చెప్పారు. గత 20 నెలల నుంచి సభ్యులు చెల్లించిన లోను సొమ్ములను యానిమేటరు కట్టడం మానివేసి సుమారు 7 లక్షల 75 వేల రూపాయలను మాయం చేసిందన్నారు. రుణ సొమ్ములను అడిగితే ఏమి చేసుకుంటారో చేసుకోండి అని సభ్యులపై ఎదురు దాడి చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, భాజపా నాయకులు కందుల వెంకట అచ్యుత రామారావుతో కలిసి డ్వాక్రా సభ్యులు జగ్గంపేట ఏపిఎం కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్నాకుల మాట్లాడుతూ అమాయకురాలైన దళిత మహిళ (డ్వాక్రా ప్రెసిడెంట్)ను యానిమేటరు నమ్మించి మొత్తం డ్వాక్రా సొమ్మును కాజేసిందంటే అధికారులు ఏ విధంగా డ్వాక్రా సంఘాలను పర్యవేక్షిస్తున్నారో తెలుసుకోవాలని ఆయన విమర్శించారు. కృప మహిళా డ్వాక్రా సంఘం ప్రెసిడెంట్ ని యానిమేటరు మాయమాటలు చెప్పి బ్యాంకు మేనేజర్ కాలు పట్టించడం అంటే వివక్షత ఎంతలా ఉందో అధికారులు తెలుసుకోవాలని ఆయన తెలిపారు. తక్షణమే డ్వాక్రా సంఘాలలో జరుగుతున్న అవకతవకలపై చర్యలు చేపట్టి, రాజపూడి యానిమేటర్ హైమావతిపై చర్యలు తీసుకొని, వారికి సహకరించిన సిసి, ఏపిఎం, బ్యాంక్ మేనేజర్ పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలన్నారు. అదే విధంగా 7 లక్షల 75 వేల రూపాయలను రికవరీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో మా ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డ్వాక్రా మహిళా సంఘం సభ్యులు,పి డి యస్ యు (వి) రాష్ట్ర కార్యదర్శి కే సతీష్, బిజెపి నాయకులు అచ్యుతరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే కూటమి లక్ష్యం-ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని, పంచ సూత్రాలతో వ్యవసాయం పండగలా మారుతుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. కొత్తపేట మండలం పలివెల శేరిపాలెంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతన్నా మీకోసం కరపత్రాలను ఇంటింటికి వెళ్లి అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయ్యిందన్నారు.పీఎం కిసాన్,అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20వేలను మూడు దఫాలుగా రైతుల ఖాతాల్లో జమ చేసామని తెలియజేశారు.రైతన్న మీకోసం కార్యక్రమంలో పంచ సూత్రాలతో రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని తెలిపారు.నీటి భద్రత కింద ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో పోలవరం,వెలిగొండ తదితర ప్రాజెక్టులు పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.అగ్రిటెక్‌లో భాగంగా ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలు,డ్రోన్లు మొదలైనవి సబ్సిడీపై అందిస్తున్నదన్నారు. డిమాండ్ ఆధారిత పంటల సాగుపై రైతులు ఆ అవగాహన పెంచుకోవాలన్నారు.ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు, వ్యవసాయధారిత పరిశ్రమలు ఏర్పాటుకు కృషి చేస్తుందని తెలిపారు.గత వైసీపీ ప్రభుత్వంలో రైతు భరోసా పేరుతో రైతులను నిలువునా మోసం చేశారన్నారు.ఏడాదికి రూ.7500 మాత్రమే రైతుల ఖాతాలో జమ చేశారని విమర్శించారు.కూటమి ప్రభుత్వం చెప్పింది చెప్పినట్లుగా రూ.20 వేలను పీఎం కిసాన్ పథకంతో కలిపి రైతుల ఖాతాలో జమ చేసిందన్నారు.వైసీపీ ప్రభుత్వ హయాంలో ధాన్యం సేకరణ నగదు రైతులకు జమ కావడానికి ఆరు నెలల వరకు సమయం పట్టేది అన్నారు.ఇప్పుడు ధాన్యం అమ్మిన వెంటనే 24 గంటల్లో రైతులు ఖాతాలో నగదు జమవుతుందన్నారు.ఈ విధంగా అన్నదాతల అభ్యున్నతికి అవిశ్రాంతంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా రైతుల సమస్యలకు ఇంటి వద్దనే పరిష్కారం



– జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ :** రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "రైతన్న మీకోసం" కార్యక్రమం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని జిల్లా కలెక్టర్ కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కడియం గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ స్వయంగా రైతుల ఇళ్లకు వెళ్లి వారితో ముఖాముఖి మాట్లాడి పంటల పరిస్థితి, సాగు విధానాలు మరియు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంట వ్యవసాయ శాఖ అధికారులు మరియు అనుబంధ శాఖల సిబ్బంది గ్రామంలో ఇంటింటికీ తిరిగి రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని తక్షణ పరిష్కార మార్గాలను సూచించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యవసాయ అనుబంధ పథకాలపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి రైతుకు ప్రభుత్వ ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటు న్నామని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ముఖ్య లక్ష్యమని కలెక్టర్ పేర్కొన్నారు. క్షేత్ర స్థాయి వారీగా వ్యవసాయ మరియు అనుబంధ శాఖల అధికారులు గ్రామాలను సందర్శిస్తూ రైతులకు సాంకేతిక సలహాలు అందిస్తున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ వంటి పథకాల వివరాలను రైతులకు వివరిస్తూ ప్రభుత్వ సహాయాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని వ్యవసాయ అధికారులు సూచించారు. నీటి భద్రత, పంటల ప్రణాళిక, ఆధునిక సాంకేతికత వినియోగం, ఆహార ప్రాసెసింగ్ మరియు వ్యవసాయాభివృద్ధి అనే ఐదు సూత్రాల వ్యూహంతో రైతన్న మీ కోసం కార్యక్రమం అమలు జరుగుతోందని తెలిపారు. పంట మార్పిడి విధానం మరియు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల వల్ల కలిగే లాభాలను రైతులతో కలెక్టర్ కీర్తి చేకూరి చర్చించారు. లాభసాటిగా ఉన్న పద్ధతులను నిరంతరం కొనసాగించాలని, వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన విధానాలను అనుసరించాలని కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమానికి సంబంధించిన మరింత సమాచారం మీ మీ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంటుందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు.

# విభిన్న ప్రతిభావంతులకు ఉచిత బస్సుసౌకర్యం



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** విభిన్న ప్రతిభావంతులకు (దివ్యాంగులకు) ఏపీ ప్రభుత్వం శుభవార్త అందించిందని కాకినాడ జిల్లా టిడిపి విభిన్న ప్రతిభా వంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర అన్నారు. ఈ పథకం బుధవారం నుంచి అమల్లోకి రానున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగశక్తి ఇంద్రధనస్సు పేరుతో దివ్యాంగులకు ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వం ప్రకటించిన ఈ నిర్ణయంతో 40% వికలాంగత్వం పైబడిన దివ్యాంగులందరికీ పల్లె వెలుగు, ఆర్డినరీ, ఎక్స్ బస్సు, సిటీ ఆర్డినరీ, బస్సులలో ఉచిత బస్సు సౌకర్యం సౌలభ్యాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. మార్చి 18న బుధవారం మంగళగిరి నియోజకవర్గంలో ఉదయం 11 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. జగ్గంపేట ఆర్టీసీ కాంప్లెక్స్ లో ఉదయం 11 గంటలకు జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ దివ్యాంగులకు ఉచిత బస్సు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి దివ్యాంగులందరూ రావాలని ఆయన పిలుపునిచ్చారు. దివ్యాంగులను అన్ని విధాల ఆదుకుంటూ 6000, 10,000, 15,000 పింఛన్ పెంచడమే కాకుండా నేడు దివ్యాంగులకు ఉచిత బస్సులు కూడా అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కు కృతజ్ఞతలు తెలియజేశారు. కూటమి సర్కార్ నిర్ణయంపై విభిన్న ప్రతిభావంతుల తరుపున హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కాకినాడ జిల్లా టిడిపి విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షులు మండపాక అప్పన్న దొర తెలియజేశారు.

# సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను స్థానిక స్థాయిలో అమలుపై శిక్షణ..



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో యం పి టి సి, మరియు వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏలేశ్వరం మండల పరిషత్ అధ్యక్షుడు కాకినాడ జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులు గొల్లపల్లి బుజ్జి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి మాట్లాడుతూ అభివృద్ధి సుస్థిర లక్ష్యాలను స్థానిక స్థాయిలో అమలు చేయడానికి ఎంపీటీసీ వార్డు, ప్రజా ప్రతినిధులకు ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చిక్కాల రాజ్యలక్ష్మి, లక్ష్మణరావు, సాదే లోవరాజు, డిప్యూటీ ఎంపీడీవోలు రామరాజు వర్మ, సి హెచ్ ఎస్ సత్యనారాయణ రాజు, పాలక వర్గ సభ్యులు పసల సూరిబాబు, విజ్జినగిరి ప్రసాద్, కొప్పుల బాబ్జి, పసల సూర్యనారాయణ,వివిధ గ్రామల ప్రజా ప్రతినిధులు, వార్డ్ సభ్యులు, గ్రామ అభివృద్ధి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### కౌన్సిల్ సమావేశం కోరంలేని కారణంగా వాయిదా



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం కోరం లేని కారణంగా వాయిదా పడింది.మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి ప్రకటించారు. కౌన్సిల్ సమావేశమానికి కేవలం గౌరవ సభ్యులు పిల్లాడి సత్యవతి ,గొర్రెల జయలక్ష్మి, బలుసు వాసు ముగ్గురు, అధికారులు మాత్రమే హాజరు కావడం జరిగింది.

# ఏజెన్సీ ప్రాంతంలో..'డ్రోన్' సహాయంతో పేకాట శిబిరాలపై దాడులు!



- 10 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ అటవీ ప్రాంతాల్లో డ్రోన్ సహాయంతో పేకాట శిబిరాలపై పోలీసులు దాడులు నిర్వహిస్తున్నారు. రంపచోడవరం, గంగవరం పోలీస్ స్టేషన్ల పరిధిలో డ్రోన్ల సహాయంతో పేకాట శిబిరాలను గుర్తించారు. పోలవరం జిల్లా ఇంచార్జ్ ఎస్పీ అమిత్ బర్దర్ ఆదేశాలు మేరకు రంపచోడవరం ఇంచార్జ్ ఎస్‌డిపిఓ బి.హేమంత్ పర్యవేక్షణలో రంపచోడవరం సిఐ ఎన్.సన్యాసి నాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ వెంకటరావు సిబ్బంది సహాయంతో కచ్చితమైన సమాచారం మేరకు రంపచోడవరం మండలం చెరువూరు గ్రామ శివారులో సోమవారం పేకాట శిబిరం పై ఆకస్మిక దాడులు నిర్వహించారు. పేకాట ఆడుతున్న వారిపై డ్రోన్ సహాయంతో రైడ్ నిర్వహించడం జరిగింది. ఈ రైడ్‌లో పేకాట ఆడుతున్న పదిమంది వ్యక్తులను పట్టుకొని, వారి వద్ద నుండి రూ.5,400లు నగదు, ఏడు మొబైల్ ఫోన్లు, రెండు మోటర్ బైక్ లు, కార్డ్స్ పోలీసులు సీజ్ చేయడం జరిగింది. పోలీసుల రాక గమనించి, పేకాట శిబిరం నుండి కొంతమంది వ్యక్తులు పారిపోవడం జరిగిందని, త్వరలో వారిని అరెస్ట్ చేస్తామని పోలీసులు తెలిపారు. ఏజెన్సీ గ్రామాల్లో డ్రోన్ సహాయంతో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిపై నిఘా పెట్టడం జరిగిందని పోలీసులు పేర్కొన్నారు. ఎవరైనా ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలలో పాల్గొంటే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గంగవరం మండలంలో..గంగవరం మండలంలో పోలీసులు డ్రోన్ సహాయంతో కోడి పందాలు పేకాట శిబిరాలు గురించి గాలింపు చర్యలు చేపట్టారు.

అడ్డతీగల సీఐ నరసింహమూర్తి, గంగవరం ఎస్సై వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసులు గంగవరం మండలం మొల్లేరు పరిసరాల్లో డ్రోన్ ఎగురవేసి అటవీ ప్రాంతంలో గాలింపు చర్యలు చేపట్టారు. కోడి పందాలు, పేకాట నిర్వహణపై నిఘా కొనసాగుతుందని, సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## 22న హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి ముసాయిదా చట్టంపై అవగాహనా సదస్సు



**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక అచ్యుతా పురం గేట్ వద్దగల ఆర్ ఎస్.ఎస్.కార్యాలయం వ్యా సభ ^వన్‌లో ఈ నెల 22వ తేది ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హిందూ దేవాలయాల స్వయం ప్రతిపత్తి ముసాయిదా చట్టం పై అవగాహనా సదస్సు నిర్వహించబడుతున్నదని ఆసక్తి గలవారందరూ ఈ సదస్సులో పాల్గొని హిందూ దేవాలయాలు స్వయం ప్రతిపత్తి కోసం జరిగే ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆహ్వానిస్తున్నామని కాకినాడ జిల్లా అధ్యక్షులు రాజమహంతి రవిశంకర్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సదస్సుకు అనేక మంది ముఖ్యులను ఆహ్వానించి వారికి ముసాయిదా చట్టం వివరాలు అందించి వారి సూచనలు సలహాలు తీసుకోవడం జరుగుతుందని పట్నాయక్ అన్నారు. కార్యక్రమంలో ప్రధానవక్తగా ఆంధ్ర ప్రదేశ్ మందిర ఏవం అర్చక పురోహిత ప్రముఖ్ శివశంకర్, వక్తగా ఆంధ్రప్రదేశ్ ఉత్తరాంధ్ర ప్రాంత ఉపా ధ్యక్షులు ఉద్దరాజు వేణుగోపాలరాజు భీమవరం వారు అవగాహన కల్పించి మార్గదర్శనం చేస్తారని ఆయన అన్నారు. పూజ్య స్వామీజీ సూర్యభాస్కరేంద్ర సరస్వతి స్వామి ఆశీర్వచనం అందజేస్తారని జిల్లా కార్యదర్శి అయినవిల్లి రాజరాజేశ్వర రుద్రశర్మ అన్నారు.

వివరాలకు 9849889359 మరియు 8886883848 నెంబర్లలో సంప్రతించవచ్చన్నారు.

# ఏపీ-ఈఏపీసెట్-2026 ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణ తేదీలలో మార్పులు

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఏపీ-ఈఏపీసెట్-2026 ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు సంబంధించిన తేదీలలో మార్పులు జరిగినట్లు ఏపీ-ఈపీసెట్-2026 కన్వీనర్ డా. ఎన్.మోహన్ రావు వెల్లడించారు. అభ్యర్థులు సవరించిన గడువులను గమనించి, సమయానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.సవరించిన గడువులు ఈవిధంగా ఉన్నాయి:ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ: 24-03-2026

- రూ.1,000/- ఆలస్య రుసుముతో చివరి తేదీ: 28-03-2026
- రూ.2,000/- ఆలస్య రుసుముతో చివరి తేదీ: 01-04-2026
- రూ.4,000/- ఆలస్య రుసుముతో చివరి తేదీ: 06-04-2026
- రూ.10,000/- ఆలస్య రుసుముతో చివరి తేదీ: 10-04-2026

తప్పుల సవరణకు అవకాశం 11-04-2026 నుండి 13-04-2026 వరకు కల్పించబడింది.

డా.ఎన్.మోహన్‌రావు మాట్లాడుతూ,అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్‌లోని మార్గదర్శకాలను జాగ్రత్తగా పరిశీలించి, గడువులకు ముందుగానే దరఖాస్తులు సమర్పించాలని సూచించారు.

అభ్యర్థులు చివరి రోజు వరకు ఆగకుండా ముందస్తుగా నమోదు చేసుకోవడం మంచిదని తెలిపారు. విద్యార్థులు అప్రమత్తంగా ఉండి సవరించిన తేదీలను గమనించాల్సిందిగా కోరారు.

# ఆస్తి పన్ను బకాయిలపై 50% వడ్డీ రాయితీ

- ప్రభుత్వం బంపర్ ఆఫర్



**కాకినాడ, మేజర్ న్యూస్ :** నగరాలు, పట్టణాల పరిధిలో ఆస్తిపన్ను బకాయిలు ఉన్న వారికి రాష్ట్ర ప్రభుత్వం ఊరట కలిగించే నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఉన్న బకాయిలు, తాజా డిమాండ్లను కలిపి ఈ నెల 31వ తేదీలోగా చెల్లిస్తే వడ్డీపై 50 శాతం రాయితీ కల్పించాలని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నిర్ణయం వల్ల పన్ను చెల్లింపుదారులకు గణనీయమైన లాభం చేకూరనుంది.ఈ నేపథ్యంలో కాకినాడ నగరపాలక సంస్థ ప్రజల్లో అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచార కార్యక్రమాలను చేపట్టింది. డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచార వాహనాలను ఏర్పాటు చేసి నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ వాహనాల ద్వారా పన్ను రాయితీ వివరాలను ప్రజలకు తెలియజేస్తూ, గడువు ముగిసేలోగా బకాయిలను చెల్లించాలని సూచిస్తున్నారు.నగరపాలక సంస్థ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న 50 శాతం వడ్డీ రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గడువు ముగిసేలోపు బకాయిలు చెల్లించడం ద్వారా అదనపు భారం తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆస్తిపన్ను బకాయిలను సమయానికి చెల్లించి రాయితీ ప్రయోజనాలను పొందాలని కమిషనర్ సూచిస్తున్నారు. సెలవు రోజుల్లో కూడా ఆస్తిపన్ను త్రాగునీటి కుళాయి పన్ను చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని ప్రజలు సెలవు రోజుల్లో కూడా పనులను చెల్లించి కార్పొరేషన్కు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కేపీ సుధాకర్, ఎస్ఈ పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## కమనీయంగా వేద అధ్యయనోత్సవాలు

- గరుడ, సింహ వాహనాలపై విహరించిన స్వామివారు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి క్షేత్రంలో కళ్యాణోత్సవాలకు ముందుగా జరిగే వేద అధ్యయనోత్సవాలు సోమవారం మూడవరోజు కమనీయంగా జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం దివ్య ప్రబంధ పారాయణం, తీర్ధ గోష్ఠి, నీరాజనం మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను వైష్ణవ పండితులు ఆధ్వర్యంలో అర్చకులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామివారు గరుడ, సింహ వాహనాలపై మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయప్రదానం చేశారు. దీంతో మాడవీధులన్నీ గోవింద నామస్మరణతో ప్రతిధ్వనించాయి. వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం నిర్వహించారు .ఛైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బుధవారం స్వామివారు హంస వాహనంపై విహరించనున్నారు. ఈ మేరకు దేవస్థానం తగు ఏర్పాటు చేసింది.

## రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

- యువ నాయకులు బందారు సంజీవ్



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** రైతులకు వివిధ సంక్షేమ పథకాలు ద్వారా రైతుల అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కృషిచేస్తుందని యువ నాయకులు బందారు సంజీవ్ అన్నారు. ఆయన మండలంలోని ఉచ్చిలి గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో వ్యవసాయ అభివృద్ధికి డ్రోన్లు వినియోగం వంటి వాటిపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి శిక్షణా కార్యక్రమాలు వంటివి ఏర్పాటు చేసి తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. బ్యాంకుల ద్వారా సకాలంలో రుణాలు అందించడం వంటివి చర్యలు చేపట్టి రైతులకు మేలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి పట్టాభి రామయ్య, మండల టిడిపి అధ్యక్షులు కూసం పూడి రామకృష్ణంరాజు, కూటమి నాయకులు తోటకూర సుబ్బరాజు, ముదునూరి రాంబద్ర రాజు, వెచ్చ అనిల్, తోట రజని, పాలంగి రవిచంద్ర తదితరులు ఉన్నారు.

## నాగులపల్లిలో 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** దేవీపట్నం మండలం నాగులపల్లి గ్రామ సమీపంలో సారా తయారు చేసేందుకు వినియోగించే 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు రంపచోడవరం ఎక్సైజ్ సిఐ శ్రీధర్ సోమవారం తెలిపారు. విశాఖపట్నం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు మేరకు పోలవరం జిల్లా రంపచోడవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని దేవీపట్నం మండలం నాగులపల్లి గ్రామంలో ఆకస్మిక దాడులు నిర్వహించి 600 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసామని ఎక్సై జ్ సిఐ శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన ఒక వ్యక్తిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా రంపచోడవరం ఏఈఎస్‌టిఎఫ్ సిబ్బంది ఈ వారంలో దేవీపట్నం మండలం దొనలంకపాలెం గ్రామంలో దాడులు నిర్వహించి, 20 లీటర్ల నాటు సారాతో ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు రంపచోడవరం ఎక్సైజ్ సి ఐ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా నవోదయం 2.0 లో భాగంగా దేవీపట్నం మండలంలో జరిపిన దాడులలో 50 కేసులు నమోదు చేసి, 46 మందిని అదుపులోకి తీసుకొని 45 మందిని బైండోవర్ చేయించడం జరిగిందని తెలిపారు. వీరిలో మరల నేరాలకు పాల్పడిన 6గురిని మండల మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చి రూ.80,000లు ప్రభుత్వానికి జమ చేసినట్టు ఎక్సైజ్ సిఐ తెలిపారు.

# నేడు "దివ్యాంగశక్తి" దివ్యాంగులకి ఉచిత బస్సు సౌకర్యం

-ఎనిమిది నియోజకవర్గాల్లో శాసనసభ్యులచే ప్రారంభం
-దివ్యాంగులతో సహా పంక్తి భోజనం
-జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి




రాజమహేంద్రవరం, మేజర్ న్యూస్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న దివ్యాంగశక్తి పథకం ద్వారా దివ్యాంగులకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మార్చి 18న బుధవారం ఉదయం 11.30 గంటలకు ప్రారంభించనున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వివిధ శాఖల అధికారులతో దివ్యాంగశక్తి పథకం పై టెలికాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చెయ్యడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, రాష్ట్ర స్థాయిలో ఈ పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించి, దివ్యాంగులతో కలిసి బస్సులో ప్రయాణించనున్నారని వెల్లడించారు. అదే సమయంలో తూర్పు గోదావరి జిల్లాలోని ఎనిమిది నియోజక వర్గాల్లో స్థానిక శాసన సభ్యులు సూచించిన ప్రదేశాల నుంచి బస్సులు ప్రారంభమై దివ్యాంగులతో ప్రయాణం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 60 నుంచి 80 మంది దివ్యాంగులను గుర్తించి రెండు విడతలుగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బస్సు ప్రయాణం పూర్తి చేసిన తరువాత దివ్యాంగులకు తగిన భోజన సదుపాయం కల్పించాలన్నారు. అదేవిధంగా మరో బృందంలోని దివ్యాంగులతో స్థానిక శాసన సభ్యులు వారి నివాస ప్రాంతాల్లో లేదా సూచించిన ప్రదేశాల్లో సహపంక్తి భోజన కార్యక్రమంలో పాల్గొననున్నారని కలెక్టర్ తెలిపారు. ఇందుకు నియోజక వర్గం ప్రత్యేక అధికారులు శాసన సభ్యులు తో కార్యక్రమం యొక్క పూర్తి వివరాలు తెలియ చెయ్యాలని ఆదేశించారు. దివ్యాంగశక్తి ఉచిత బస్సు సౌకర్యం ప్రారంభోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్‌లో కూడా దివ్యాంగులతో కలిసి సహపంక్తి భోజనం నిర్వహించనున్నట్లు జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ వెల్లడించారు. నియోజకవర్గాల వారీగా దివ్యాంగులను గుర్తించి జాబితాలు సిద్ధం చేయాలని, వికలాంగుల సంక్షేమ శాఖ అధికారులు, డీఆర్‌డిఏ మరియు మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్లు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ప్రజా రవాణా అధికారి శాసన సభ్యులు సూచించిన మేరకు అవసరమైన బస్సులను ఆయా ప్రాంతాల్లో సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో వికలాంగుల సంక్షేమ శాఖ, ఆర్టీసీ, డీఆర్‌డిఏ, మెప్మా, మున్సిపల్, మండల అభివృద్ధి, పోలీసు, విద్యా మరియు సమాచార శాఖల అధికారులు పాల్గొని కార్యక్రమం విజయవంతానికి అవసరమైన ఏర్పాట్లపై సమీక్షించారు.

## రాష్ట్ర ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రికను అందజేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి దంపతులు





అనపర్తి, మేజర్ న్యూస్ : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఉన్న జేఆర్‌సీ కన్వెన్షన్‌లో ఏప్రిల్ 2వ తేదీన జరగనున్న అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, మహాలక్ష్మి దంపతుల కుమార్తె డా. నల్లమిల్లి సనాతని, పాణ్యం శాసనసభ్యురాలు, నంద్యాల జిల్లా టిడిపి అధ్యక్షురాలు గౌరు చరితారెడ్డి, వెంకటరెడ్డి దంపతుల కుమారుడు జనార్దన్ రెడ్డి లకు జరుగు వివాహ వేడుకకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వానిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మరియు ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వార్లకు వివాహ ఆహ్వాన శుభలేఖను అందజేశారు. ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వెళ్లి ఆహ్వాన పత్రికను అందించారు. మీరు వెంట తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నల్లమిల్లి మనోజ్ రెడ్డి, సుమేఘరెడ్డి దంపతులు, వధువు డా. నల్లమిల్లి సునాతని, వరుడు గౌరు జనార్దన్ రెడ్డి ఉన్నారు.

# ఉపాధ్యాయులకు ఐఆర్ వెంటనే ప్రకటించాలి




– పిఆర్‌సి కమిషన్ వేయాలి
– పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి డిమాండ్

పిఠాపురం, మేజర్ న్యూస్ : ఉద్యోగ ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పిఆర్సి కమిషన్ వేసి వెంటనే ఐర్ వెంటనే ప్రకటించాలని పిడిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పిఠాపురం మండలంలోని పలు హై పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల ఇబ్బందులను తెలుసుకున్నారు. 2023 జూన్‌తో 11వ పిఆర్‌సి ముగిసిపోగా 12వ పిఆర్సి అమలు చేయకపోవడం వల్ల ఉద్యోగ ఉపాధ్యాయులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు మంచి పిఆర్‌సి ఇస్తానని, ఆర్థిక బకాయిలు చెల్లిస్తానని, మధ్యంతర భృతి ప్రకటిస్తానని హామీ ఇచ్చారని అన్నారు. ఏప్రిల్‌తో కూటమి ప్రభుత్వానికి రెండు సంవత్సరాల పూర్తి కావస్తున్న పిఆర్సి కమిషన్ వేయలేకపోవడం దారుణమన్నారు. 6 నెలలకు ఇవ్వాల్సిన డిఏ ఒక్క నెలకి మాత్రమే ఇచ్చారని, పెండింగ్ డిఎలు వెంటనే చెల్లించాలని రూ. 30 వేల కోట్ల ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం విద్యా సంస్కరణల పేరుతో ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలలో, ఉన్నత పాఠశాలలో విలీనం చేశారని ఈయన నేపథ్యంలో ఒకటి నుండి పది తరగతులు మాత్రమే ఉన్నాయని, వసతులు లేక విద్యార్థులు ఉపాధ్యాయులు, ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో నాడు-నేడులో భాగంగా అసంపూర్తిగా ఉన్న 20 శాతం భవనాలకు నిధులు కేటాయించి ఉపయోగం లోకి తీసుకురావాలని అన్నారు. ప్రస్తుతం ఉపాధ్యాయుడు తరగతి గదిలో స్వేచ్ఛగా పాఠాలు చెప్పే పరిస్థితి లేదని అంతర్జాల కబంధహస్తాలలో ఉపాధ్యాయులను అధికారులు బంధిస్తున్నారని ఆయన తెలియజేశారు. వెబ్‌ఎక్స్, మోస్ట్ అర్జెంటు మెసేజ్‌లతో ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ పిఠాపురం మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పప్పు శ్రీనివాస్, దడాల ప్రవీణ్ కుమార్, యూటీఎఫ్ జిల్లా నాయకులు పాములయ్య, సీతారామరాజు, సరస్వతి రాజు, రాజేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## డి.ముప్పవరంలో మంత్రి కందుల దుర్గేష్ ఆకస్మిక తనిఖీ

-పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల పరిశీలన
-కూటమి ప్రభుత్వ విద్యా సంస్కరణలను వివరించిన మంత్రి దుర్గేష్



నిడదవోలు, మేజర్ న్యూస్ : నిడదవోలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వర్యులు కందుల దుర్గేష్ మంగళవారం డి.ముప్పవ రంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల మరియు అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల సందర్శనలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్ తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో సరదాగా గడిపారు. స్వయంగా పాఠ్యపుస్తకాన్ని చేతబూని విద్యార్థులను ప్రశ్నలు అడిగి వారి విద్యా సామర్థ్యాన్ని పరీక్షించారు. "కందుల దుర్గేష్ అంటే ఎవరు? ఈ నియోజకవర్గానికి ఆయన ఏమవుతారు?" అని చమత్కరిస్తూ విద్యార్థుల్లో స్నేహపూర్వక వాతావరణాన్ని నింపారు. తాను కూడా సామాన్యంగా చదువుకుని పైకి వచ్చిన వాడినేనని, ఎవరూ కంగారు పడకుండా బాగా చదువుకోవాలని హితబోధ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుపై మంత్రి దుర్గేష్ ప్రత్యేక దృష్టి సారించారు. వంట గదిని తనిఖీ చేసి, వంట ఏజెన్సీ నిర్వాహకులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజనం అందుతుందా? రాగి జావ రుచిగా ఉందా? అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన మెనూలో ఏవైనా పదార్థాలు తక్కువైతే ధైర్యంగా అడిగి తీసుకోవాలని సూచించారు.

## వెంకన్న నిత్య అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



ఆత్రేయపురం, మేజర్ న్యూస్ : కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్యాన్నదాన పథకానికి మంగళవారం మచిలీపట్నంకు చెందిన డా. దేవనబోయిన రామమోహనరావు, వాణి దంపతులు, వారి కుటుంబ సభ్యులు రూ. 1,00,116 లు విరాళంగా సమర్పించినారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

## శ్రీ సత్యదేవుని దర్శించుకున్న నాదెండ్ల మనోహర్



అన్నవరం, మేజర్ న్యూస్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దర్శనార్థం ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మరియు కాకినాడ రూరల్ శాసన సభ్యులు పంతం నానాజీ, జనసేన పార్టీ నాయకులు స్వామివారి సన్నిధికి విచ్చేశారు. ముందుగా దేవస్థానం చైర్మన్ ఐ.వి.రోహిత్, దేవస్థానం కార్యనిర్వహణ అధికారి వేంద్ర త్రినాథరావు, ఆలయ ప్రధాన అర్చకులు, ఆలయ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనానంతరం వేద పండితులు వేద ఆశీర్వచనం అందించగా దేవస్థానం అధికారులు శ్రీ స్వామివారి శేషవస్త్రం, చిత్రపటం, ప్రసాదం అందజేశారు.